# మహిళా సాధికారత


MAHILA SADHIKARATHA

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాసపత్రిక

mas

సంపుటి :18 సంచిక: 3 రంగారెడ్డి నవంబర్ 2019 పేజీలు : 36 వెల : రూ. 10/-


## ఆఫ్రికాలో ప్రపంచ ' సహకార ' సదస్సు !




రువాండాలోని కిగాలిలో జరిగిన ప్రపంచ సహకార సదస్సుకు హాజరైన శ్రీమతి వందనా శివ ప్రభృతులతో 'మాస్' ఎం డి ,సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ...సదస్సులో శ్రీ సి ఎస్ ప్రసంగం.




ఉత్తమ ఎఫ్ పి ఓ లకు 'ఎకనామిక్ టైమ్స్' అవార్డుల నిర్ణాయక సంఘం సభ్యునిగా శ్రీ సి ఎస్ రెడ్డి




తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, మహిళాభివృద్ధి సొసైటీ మధ్య సహకార ఒప్పందం




నెల్లూరులో జరిగిన 5-కె రన్ లో పాల్గొన్న శ్రీరామపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో 'మాస్' ప్రతినిధి


Brot für die Welt బ్రెడ్ ఫర్ ది వరల్డ్ సౌజన్యంతో



నాబార్డ్ ఆధ్వర్యంలోని ఎఫ్ పి ఓ ల సి ఇ ఓ లకు చిత్తూరు జిల్లా మదనపల్లిలో 'మాస్' శిక్షణ



ఆజీవ ఎఫ్ పి ఓ, నల్లమాడ ఎఫ్ పి ఓ, నిమ్మనపల్లి ఎఫ్ పి సి బోర్డుల డైరెక్టర్ల సమావేశాలు




అనంతపురంలో జరిగిన న్యాయ సేవల శిబిరం... శిబిరంలో సిరి ధాన్యాలతో రెడ్స్ సంస్థ రంగవల్లి ...
అగ్రహారంలో క్షేత్ర దినోత్సవం



హైదరాబాద్‌లో ఎస్ హెచ్ జి మహిళలకు గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు ... ఒంగోలులో మార్పు పోషణ పథకం భాగస్వామ్య సదస్సు ... ఊరచెరువు ఎస్ హెచ్ జి సమావేశం

సంపాదకీయం



# కొత్తదనం !

ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురు చూపులతో కాలక్షేపం చేయడం వివేకం కాదు. ఈ ధోరణికి భిన్నంగా రైతు సంఘాలు, సమాఖ్యలు, వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థలు, (ఎఫ్ పి ఓ లు), కంపెనీలు (ఎఫ్ పి సి లు) పేరు ఏదైతేనేం రైతులు సంఘటితమై వ్యవసాయాన్ని సరైన ఆదాయ మార్గంగా మలచుకోవడానికి, అన్నదాత తీరని అప్పులపాలై అసువులుబాయకుండా, సుస్థిరాభివృద్ధి సాధించడానికి అనేక రకాలుగా కృషి చేస్తుండడం ఆహ్వానించదగిన పరిణామం. భూసార పరీక్ష నుంచి వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ వరకు, పెరట్లో కూరగాయల పెంపకం నుంచి, కోళ్ళ పెంపకం, చిన్న జీవాల పెంపకం, పాడి పశువుల పెంపకం వంటి అదనపు ఆదాయ మార్గాలను ఏర్పాటుచేయడం వరకు, పశువుల, చిన్న జీవాల ఆరోగ్య సంరక్షణ చర్యల వరకు, అదునులో విత్తనాలు, ఎరువుల వంటి వ్యవసాయ పెట్టుబడులను రైతుకు తక్కువ ధరకు సులువుగా అందుబాటులోకి తేవడం వరకు, ఇతర ప్రాంతాలలోని రైతు సంస్థలను సందర్శించి కొత్తకొత్త వ్యవసాయ విషయాలను తెలుసుకుని తమ ప్రాంతంలో కూడా సభ్య రైతులతో ఆచరింప జేయడం వరకు...ఇలా ఎన్నోరకాల సేవలను, సలహా సంప్రతింపులను ఈ సంఘాలు, సమాఖ్యలు, ఎఫ్ పి ఓ లు రైతులకు అంద జేస్తున్నాయి. ఈ సరికొత్త చైతన్యంతో వ్యవసాయరంగంలోను, రైతు జీవితంలోను చెప్పుకోదగిన ఆశావహమైన మార్పు గోచరిస్తున్నది. ఈ సమాఖ్యలు, ఎఫ్ పి ఓ లు 'మహిళాభివృద్ధి సొసైటీ' తదితర ప్రోత్సాహక సంస్థల లేదా మార్గదర్శక సంస్థల తోడ్పాటుతో ఈ అవగాహన కార్యక్రమాలను, సేవలను నిర్వహిస్తున్నాయి. ఈ మేరకు అవి సాగిస్తున్న కృషి అభినందనీయమే అయినప్పటికి ఆ సంస్థలు వ్యవసాయ రంగంలో ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులపైన, నూతన ఆవిష్కరణలపైన తమంత తాముగా అవగాహన పెంపొందించు కుంటూ, తమ ప్రాంతంలో, తమ రైతులకు ఆ కొత్త ప్రయోగాల ఆచరణ సాధ్యాసాధ్యాలను ఆకళింపు చేసుకుని వాటిని తామూ అనుసరించి మరింత నాణ్యమైన ఉత్పత్తులను, దిగుబడులను, గిట్టుబాటు ధరలను సాధించే కృషి చేయడం అవసరం. ఇలాంటి కొత్త వ్యవసాయ విధానాలు, ఆవిష్కరణలను గురించి 'మహిళా సాధికారత' పత్రికలో ప్రతి నెల అనేక కథనాలను ప్రచురిస్తున్నాం. ఈ సంచికలో కూడా కొత్త వ్యవసాయ పరికరాల గురించి, వంగడాల గురించి ప్రచురించాం. ఇక ఆ సమాచారాన్ని ఉపయోగించుకోవడం మీ వంతు!

జీవన వేదం

# పుస్తక విన్నపం!

'ఆకాశవాణి కార్యక్రమాలలో సంస్కృత పాఠం మొదలుకాగానే 'కేయూరా న విభూషయంతి పురుషం హారా న చంద్రోజ్వలా ...' అంటూ, శరీరానికి వేసుకునే అన్ని అలంకారాలు నశిస్తాయని కేవలం హృదయాన్ని సంస్కరించే వాణి (వాక్కు) మాత్రమే మనిషిని మహోన్నతుని చేయగలిగిన అలంకారమని నాందీ శ్లోకం వినిపించే విషయం చాలామందికి గుర్తుండే వుంటుంది. సంస్కారపూరితమైన వాక్కు అంటే విద్య అని సంకేతం. 'విద్యలేనివాడు వింత పశువు' అనే నానుడి చదువు లేని వ్యక్తి ఆఖరుకు పశువుకంటె కూడా హీనమని మనకు గుర్తు చేస్తుంది. సంస్కారానికి, వివేకానికి కేవలం చదువొక్కటే మూలం కాకపోయినా చదువు మనిషి ఆలోచనను, వివేకాన్ని మరింత విస్తృతం చేయడానికి తోడ్పడుతుందనేది నిస్సందేహం! వివేకంతో, సంస్కారంతో కూడిన మాటకు విద్య సంకేతమైతే విద్యకు పుస్తకం సంకేతంగా మనం భావిస్తాం. పుస్తకాన్ని సాక్షాత్తు సరస్వతీదేవిగానే మనం సంభావిస్తాం. అది మూఢనమ్మకమని అనుకున్నా, ఏదైనా నమ్మకంగా చెప్పడానికి మనం పుస్తకం మీద ఒట్టుపెట్టుకుని మరీ చెబుతాం. పుస్తకానికి మనం అంతటి విలువ ఇస్తాం. అయితే, కొందరు మాత్రం పుస్తకాన్ని చాలా నిర్లక్ష్యంగా పడేస్తారు. దానిని జాగ్రత్తగా కాపాడుకోవాలని చూడరు. మరికొందరు పుస్తకంలోని విషయాన్ని మనసుకు ఎక్కించుకోవడం కంటె దానిని కేవలం హస్త భూషణంగానే చూస్తారు. ఇలాంటివారి నుంచి తనను రక్షించమని పుస్తకం ప్రాధేయపడుతుందట! కరుణశ్రీ పుష్పవిలాపంలో పువ్వులు 'మయలపడి పోయెనోయి నీ మనుజ జన్మ' అని మనిషి కుసంస్కారానికి కుమిలిపోయినట్టు పుస్తకం కూడా 'ఓ మనిషీ! నాకు నూనె మరకలు చేసి పాడుచేయవద్దు, నీళ్ళలో పడేసి నా రూపుమాపవద్దు, కుట్టు వీడిపోతే నేను క్షీణించి పోతాను, అందువల్ల కుట్టు సరిగా వుండేలా చూడు, అన్నిటికి మించి చదువు విలువ తెలియని మూర్ఖుని చేతికి నన్ను యివ్వవద్దు' అంటూ విలపిస్తుందని, విన్నవిస్తుందని ఒక శ్లోకం పేర్కొంటుంది. ఈ పుస్తకం మాదిరిగానే ఒక కవికూడా మన నుదుటి వ్రాతవ్రాసే బ్రహ్మదేవునికి ఇలా మొరపెట్టుకున్నాడట... ప్రభూ! నా కర్మఫలంగా ఏ శిక్ష అనుభవించమని నా నొసట వ్రాసినా ఆనందంగా భరిస్తాను, కాని స్వామీ కవితా రసాస్వాదనం తెలియని మూర్ఖునికి నా కవిత్వాన్ని వినిపించవలసిన దుర్గతిని మాత్రం నా నొసట వ్రాయకు, వ్రాయకు, వ్రాయకు సుమా!' (శిరసి మా లిఖ, మా లిఖ, మా లిఖ) అంటూ ముమ్మారు వేడుకున్నాడట. సామాన్యమైన మనిషిని మనీషిగా, మహనీయునిగా మార్చి మహోన్నతత్వాన్ని కలిగించే ఆ పుస్తక విన్నపాన్ని వినిపించుకుందామా!

*ఆసక్తిగలవారి కోసం ఆ శ్లోకం:*

*తైలాద్ రక్షేత్ జలాద్ రక్షేత్ రక్షేత్ శిథిల బంధనాత్*
*మూర్ఖ హస్తే న దాతవ్యం ఏవం వదతి పుస్తకం*

Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt.Limited, S No:185, Kondapur, Hyderabad-500133, Ranga Reddi District, Telangana;Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally,Manikonda,Rangareddi District,Hyderabad-500089. **Editor:**T.Chandra Sekhar Reddy

ఒకే పరిస్థితి మనోబలం క్షీణిస్తే సమస్యగా, స్థిరంగా వుంటే సవాలుగా, దృఢంగా వుంటే అవకాశంగా మారుతుంది

## లోపలి పేజీలలో ....


- జీవ కీటక నాశనులతో ఊజీ ఈగ నివారణ ...05
- ఉమ్మడి భూముల నిర్వహణతో గ్రామాభివృద్ధి ...07
- వాటర్‌షెడ్ గ్రామాల్లో విత్తన పొట్లేళ్ళ పంపిణీ ...09
- ప్రపంచ సహకార సదస్సులో సి ఎస్ ప్రసంగం ...10
- పాలేకర్ విధానంలో రసాయనరహిత సాగు ...11
- సేంద్రియ విధానంలో 50 రకాల పండ్లు ...12
- కరువు నేలకు కనకం ఎర్రచింత ...14
- పశువుల ఆరోగ్యాన్ని ప్రభావితంచేసే అంశాలు ..17
- ఎంత వాన కురిస్తే అంతగానే పంటలు ...18
- మీ కిడ్నీలు సరిగ్గా పని చేస్తున్నాయా ? ...22
- డెంగీ దోమతో జాగ్రత్త సుమా ! ...23
- గుంతలు తవ్వే యంత్రం ... ...24
- డిడిఎస్ మహిళా రైతులకు ఈక్వేటర్ అవార్డు ...25
- పీతల సాగులో నలుగురు యువకుల నవ్యపథం ...26
- కొద్ది భూమిలో తక్కువ ఖర్చుతో చేపల పెంపకం ...27
- పత్తి పంటను పట్టి పీడిస్తున్న 'గులాబీ' ! ...28
- బాలలూ, ఆహారం తీసుకోవడంలో జాగ్రత్త ! ...29
- మీ బీమా క్లెయిమ్‌ను తిరస్కరించవచ్చు ! ...30
- ఈ బ్యాక్టీరియా ప్రాణాంతకం సుమా ! ...32
- ధరణి ఎఫ్‌పిఓకు 'సాధికారత ఫౌండేషన్'తోడ్పాటు ..34


### మహిళా సాధికారత ప్రోత్సాహక చందా

| ఏడాదికి | రెండేళ్ళకు | మూడేళ్ళకు |
|---|---|---|
| రూ.110 | రూ.200 | రూ.280 |

### ప్రకటన ఛార్జీలు

| | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం): | రూ. 25,000 |
| మల్టీకలర్ బ్యాక్ పేజి (పూర్తి): | రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి): | రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి): | రూ. 10,000 |

- చందాలు లేదా ప్రకటనలకోసం పంపే చెక్కులను, డిడిలను 'ఏపిమాస్-హైదరాబాద్' పేరుమీద మాత్రమే పంపాలి


ఎడిటర్ : టి. చంద్రశేఖర రెడ్డి

అసోసియేట్ ఎడిటర్: జె.వి. క్రిష్ణమూర్తి

ఎడిటోరియల్ కమిటి:

ఏ. కళామణి, ఎస్. రామలక్ష్మి,

ఎన్.వినాయకరెడ్డి, బి.వెంకటేశ్వర్లు

కంపోజింగ్, డిజైనింగ్

ఎన్. రమాదేవి

కన్సల్టెంట్ కె.రఘురామరాజు


గమనిక: 'మహిళా సాధికారత' అనంతమైన భిన్నత్వం నుంచి ఆశావహమైన ఏకత్వానికి వేదిక. ఈ పత్రికలో ప్రచురించే రచనలలో వ్యక్తమయ్యే అభిప్రాయాలు పత్రికా నిర్వాహకుల అభిప్రాయాలు కాకపోవచ్చు.


**మహిళా సాధికారత**

ఏపిమాస్ కార్యాలయం,

ప్లాట్ నెం.11-12, హుడా కాలని,

తానీషా నగర్, డ్రీమ్ వ్యాలీ దగ్గర,

మణికొండ, రంగారెడ్డి జిల్లా,

హైదరాబాదు-500089

ఫోన్స్ : 08413-403118/19/20

ఫాక్స్ : 08413-403117

Web:www.apmas.org

E Mail: info@apmas.org

# జీవ కీటక నాశనులతో ఊజీ ఈగ నివారణ!

- ఎన్. ప్రహ్లాదయ్య

టమాటా సాగు ద్వారా అధిక దిగుబడి వస్తున్నప్పటికీ ఊజీ ఈగ సోకడం వలన పంట దారుణంగా దెబ్బతిని రైతులకు అధిక నష్టం వస్తున్నది. ఈ తెగులు నివారణకు విపరీతంగా రసాయనిక మందులు వాడుతుండడంతో ఆ పంట తినే ప్రజలు కూడా అనారోగ్యం పాలవుతున్నారు. అందువల్ల జీవ కీటక నాశనుల ద్వారా ఊజి ఈగను అరికట్టుటకు గల సాధ్యాసాధ్యాలను పరిశీలించుటకు జి.ఐ.జడ్, బి.ఎం.జడ్ వారి ఆర్థిక సహాయంతో 'మహిళా అభివృద్ధి సొసైటీ' (మాస్) సహకారంతో 'ప్రపంచ కూరగాయల సంస్థ' (వరల్డ్ వెజిటబుల్ సెంటర్) వారు చిత్తూరు జిల్లా రామసముద్రం మండలంలోని ఆర్.నడింపల్లి గ్రామంలో శ్రీ వీరభద్ర అనే రైతు పొలంలో 500 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ప్రయోగాత్మక పరిశీలన చేశారు. ఇందులో 250 చదరపు మీటర్ల విస్తీర్ణంలో సమగ్ర



సస్య రక్షణ చేపట్టగా, మిగతా 250 చదరపు మీటర్ల విస్తీర్ణాన్ని 'కంట్రోల్ ప్లాట్'గా గుర్తించి రైతు స్వంతంగా వ్యవసాయం చేశారు ఈ పంటలో నారు నాటినప్పటినుండి రెండవ కోత వరకు పూర్తిగా పర్యవేక్షణ చేసి, వివిధ కంపెనీలకు చెందిన వివిధ రకాల జీవ కీటక నాశనులను వినియోగించడం జరిగింది. ఆ జీవ కీటక నాశనుల వివరాలు:

| పేరు | మోతాదు | పిచికారీల సంఖ్య | పంట దశ |
|---|---|---|---|
| వేప నూనె 10000 (1%) పి.పి.ఎం. | 2ఎం.ఎల్/లీ | 2 (2 నెలల విరామంతో) | నాటిన 7 రోజుల తరువాత, 60 రోజుల తరువాత |
| వేప నూనె 10000 (5%) పి.పి.ఎం. | 0.5.ఎం.ఎల్/లీ | 2 (1 నెల విరామంతో) | నాటిన 15 రోజుల తరువాత, 35 రోజుల తరువాత |
| బి.టి. | 1 గ్రా/లీ | 2 (2 నెలల విరామంతో) | నాటిన 30 రోజుల తరువాత |
| బి.టి.వార్ | 10 ఎం.ఎల్/లీ | 2 (25రోజుల విరామంతో) | నాటిన 45 రోజుల తరువాత, 70 రోజుల తరువాత |
| బవేరియా బెసియానా | 10ఎం.ఎల్/లీ | ఒకటి | నాటిన 30 రోజుల తరువాత |
| బవేరియా బెసియానా | 5ఎం.ఎల్/లీ | ఒకటి | నాటిన 40 రోజుల తరువాత |

**పిచికారీ ఖర్చు ... దిగుబడి**

| **అంశం** | **సమగ్ర సస్య రక్షణలో** | **రైతు స్వంత పద్ధతిలో...** |
|---|---|---|
| పిచికారీ ఖర్చు (రూ.లు) | 779 (47%) | 1658 |
| దిగుబడి (కేజీలు) | మొదటి కోత : 285 | మొదటి కోత : 255 |
| | రెండవ కోత : 780 | రెండవ కోత : 690 |

నేరుగా విజయం రాదు, వచ్చేవి అవకాశాలు, సాధ్యాసాధ్యాలు మాత్రమే ; వాటినే మనం విజయాలుగా మలచుకోవాలి



**ప్రయోగం నేర్పిన పాఠాలు :** ప్రయోగంలో మొదటి రెండు కోతల తరువాత గణాంకాలను పరిశీలించగా సమగ్ర సస్యరక్షణ ప్లాట్‌లో సాగుకు అయిన ఖర్చు కంట్రోల్ ప్లాట్‌లో అయిన ఖర్చుతో పోలిస్తే కేవలం 47% మాత్రమే. ఇంతేగాక దిగుబడి కూడా ఎక్కువగా వుండడం గమనించవచ్చు. ఈ ప్రయోగ ఫలితాలను గమనించిన రైతులు రామసముద్రం 'రైతు సమృద్ధి కేంద్రం'లో ఇలాంటి జీవ కీటకనాశనులను అందుబాటులో ఉంచాలని కోరారు.

**క్షేత్ర దినోత్సవం :** జీవ కీటక నాశనులను వినియోగించడం ద్వారా ఖర్చు తగ్గించడంలో భాగంగా చేపట్టిన ప్రయోగం విజయవంతం కావడంతో ప్రపంచ కూరగాయల సంస్థ రైతు పొలం దగ్గర 21-10-2019 వ తేదీన క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించి, ప్రయోగ ఫలితాలను రైతుల కందరికీ తెలియజేసింది. ఈ దినోత్సవానికి తైవాన్ నుండి ప్రపంచ కూరగాయల సంస్థ శాస్త్రవేత్త శ్రీమతి పోలా, మదనపల్లి నుండి శ్రీ కార్తీక, శ్రీ శ్రీకాంత్ రెడ్డి పాల్గొనగా, మహిళా అభివృద్ధి సొసైటీ నుండి డైరెక్టర్ శ్రీ వినాయక రెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ డా. ఎస్. ప్రహల్లాద, సాంకేతిక సిబ్బంది శ్రీ కృపానంద, శ్రీ నవీన్, రైతు మిత్రలు, రైతులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో మదనపల్లి ఉద్యాన శాఖాధికారిణి శ్రీమతి ఉమాదేవి పాల్గొని ఉద్యానశాఖ ద్వారా చేపట్టే వివిధ కార్యక్రమాలను వివరించారు. ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతం అయినందు వల్ల ఈ ప్రాంతంలోని ఇతర రైతులు కూడా ఈ ప్రయోగాన్ని తమ పొలాలకు విస్తరించి సాగు ఖర్చు తగ్గించుకోవడంతో పాటు ప్రజలకు మంచి ఆరోగ్యకరమైన కూరగాయలను అందించడానికి ముందుకు వస్తారని ఆశిద్దాం. ■



ద్వేషించడం కాక ప్రేమించడం, అనుకరించడం కాక అనుసరించడం, పొగడడం కాక అభినందించడం నేర్చినవాడు వివేకి

# ఉమ్మడి భూముల సక్రమ నిర్వహణతో గ్రామాభివృద్ధి !

– ఫక్రున్నీ

**ఒ**క గ్రామంలో నివసించే వారందరికీ ఉమ్మడి భూములను వినియోగించే హక్కు ఉంటుంది. ప్రతి గ్రామంలోను వేరు వేరు అవసరాల కోసం కొంత భూమి ఉంటుంది. పశువుల మేతకు వదిలిన బీడు, పంట కళ్ళాలు, శ్మశానాలు లాంటి వేరు వేరు అవసరాల కోసం కొంత భూమి కేటాయించి ఉంటుంది. కొన్ని ఉమ్మడి భూములలో చిన్న చిన్న చెరువులు, కుంటలు కూడా ఉంటాయి. వీటి మీద గ్రామస్తులందరికీ సమాన హక్కులుంటాయి, ఏ ఒక్కరి సొంతం కాదు. అంటే ఈ భూమి నాది, వేరే ఎవరూ దీనిని ఉపయోగించుకో కూడదు అని చెప్పడానికి వీలు లేదు.

**ఉమ్మడి భూములు–ఉపయోగాలు**



1. ముఖ్యంగా వ్యవసాయం మీదనే ఆధారపడి జీవిస్తున్న వారి పశువులకు మేత ఈ ఉమ్మడి భూముల నుండి దొరుకుతున్నది.
2. గ్రామీణ ప్రజల నిత్యావసర వస్తువులు – అనగా కట్టెపుల్లలు, పశువుల మేత, తేనె, అడవి పండ్లు, ఆకు ఎరువు, కూసాలు, వాసాలు పూరిళ్ళపై కప్పుకు కావలసిన బోద గడ్డిని ఈ భూములే అందజేస్తున్నాయి.
3. పూర్తిగా వ్యవసాయం మీద మాత్రమే ఆధారపడక, రైతులు పశువుల పెంపకం, అటవీ ఉత్పతుల వ్యాపారం (అనగా అడవి కలప తప్ప మిగతా వస్తువులు తెచ్చుకొని) చేయడానికినఈ భూములు అవకాశం కల్పిస్తున్నాయి. ఈ విధంగా అదనపు ఆదాయం వచ్చే అవకాశం ఏర్పడుతుంది.
4. సంతలు, పండుగలు, శుభకార్యాలు, ఆటల పోటీలు, జాతరలు, పంట కళ్ళాలు, పశువుల సంతలు జరుపు కొనుటకు ఈ ఉమ్మడి భూములు పనికి వస్తున్నాయి. అలాగే గ్రామంలో శ్మశాన భూమి కూడా ఈ కోవకు చెందినదే !
5. ఇలా వివిధ ప్రయోజనాలకు విశాలమైన ఉమ్మడి భూమి ఉన్నందున ప్రజలు ఆరోగ్యంగా ఉంటున్నారు. వర్షపు నీళ్ళు భూగర్భం లోనికి ఇంకుటకు ఈ భూములు సహాయపడుచున్నాయి,

**పూలలో సంపర్కం:** సాధారణంగా పునరుజ్జీవం జరగడానికి ఉత్పత్తి పెరగడానికి ఈ ప్రక్రియ తప్పనిసరి. సంపర్కం అనగా మగ పుష్పంలోని పుప్పొడి రేణువులు ఆడ పుష్పంలోని అండ కోశం లోనికి చేరడం ఈ ప్రక్రియ రెండు రకాలుగా జరుగుతుంది. 1.పరాగ సంపర్కం 2. పరపరాగ సంపర్కం ఇది తేనెటీగలు. సీతాకోక చిలుకలు, ఈగలు. కందిరీగలు, గబ్బిలాలు ద్వార జరుగుతుంది.

పంట భూములలోని, ఉమ్మడి భూములలోని మొక్కలు ఈ ప్రక్రియ ద్వార బీజోత్పత్తికి ఉపయోగపడే పుప్పొడి రేణువులు గ్రహిస్తాయి. ఈ సహజ ప్రక్రియలో ఈ పరాగ సంపర్క కారకాలు పువ్వుల నుంచి ఆహారంగా మకరందాన్ని తీసుకుంటాయి. ఈ సహజ ప్రక్రియలో ఈ పరాగ సంపర్క కారకాలు పూత దశలో సేవలనందిస్తూ పువ్వుల నుంచి ఆహారాన్ని గ్రహిస్తాయి.

పైన తెలిపిన విధంగా ఉమ్మడి భూములు పరాగ సంపర్క కారకాలకు ఆవాసాలుగా ఉండి విధిగా ప్రకృతికి సంబంధించిన సేవలను అందిస్తున్నాయి. అన్ని రకాల చెట్ల జాతులతో ఆరోగ్యంగా ఉన్న ఉమ్మడి భూమి సంవత్సరంలో 365 రోజులు ఇలాంటి ప్రాకృతిక సేవలు అందిస్తుంది.

దూరం అనుబంధానికి అడ్డంకి కాదు, దగ్గరితనంతో స్నేహం పెరగదు; ఆప్యాయత ఆత్మీయత వుంటే ఎక్కడున్నా అనుబంధమే

ప్రమాదవశాన ఈ ఉమ్మడి భూమి అగ్ని ప్రమాదాల బారిన పడినప్పుడు పరాగ సంపర్క కారకాల నివాసాలు నాశనమవుతాయి. దీని ప్రభావం వలన ఉమ్మడి భూములు, పంట భూములలో పచ్చదనం తగ్గుతుంది.

**తెగులు నియంత్రణ :** ఆరోగ్యంగా, పునరుజ్జీవ దశలో ఉన్న ఉమ్మడి భూములు అందించే మరొక ప్రాకృతిక సేవ చీడపీడలలు. తెగుళ్ళ నియంత్రణ. పైన పేర్కొన్నట్టుగా ఈ ఉమ్మడి భూములు తెగుళ్ళ నియంత్రణకు ఉపయోగపడే కారకాలకు కూడా నివాస ప్రాంతాలు, పక్షులు కీటకాలు, పురుగులు, సాలీడులు. సరీసృపాలు సహజంగా సస్య రక్షణకు తోడ్పడుతూ ఉమ్మడి భూములకు, వ్యవసాయానికి మధ్య సంధాన కర్తలుగా ఉంటున్నాయి. మెరుగైన జీవ వైవిధ్యం, పక్షులు, కీటకాలు, ఇతర జంతు జాతుల వల్ల జీవావరణ వ్యవస్థ పునరుద్ధరింపబడి ఈ ఉమ్మడి భూములు ప్రాకృతిక సేవలను నిరంతరంగా అందించగలుగుతుంది.

ఈ ఉమ్మడి భూమి వరదలు, తుపానులు, అగ్ని ప్రమాదాల వంటి విపత్తుల బారిన పడినప్పుడు పక్షులు, కీటకాలు, పురుగులు సాలిడులు సరీసృపాల నివాసాలు నాశనమవుతాయి. దీని ప్రభావం వల్ల ఉమ్మడి భూములు పంట భూములలో పచ్చదనం తగ్గుతుంది. దీనివల్ల సస్య రక్షణకు అధిక పెట్టుబడి పెట్టవలసి ఉంటుంది. ఇది పెట్టుబడి పెరిగి ఆదాయం తగ్గడానికి దారి తీస్తుంది.

**పోషకాల బదిలీ :** వ్యవసాయ భూముల ఉత్పాదక శక్తిని పెంచేందుకు నత్రజని కలిగి వున్న పచ్చి రొట్ట అవసరం. అటువంటి చెట్లు ఉమ్మడి భూములలో ఎక్కువగా ఉంటాయి. ఆకుల రూపంలో ఉన్న పోషకాలు. ఉమ్మడి భూముల నుంచి వ్యవసాయు భూములకు బదిలీ అవుతున్నాయి.

ఉమ్మడి భూములలో పశువులను మేపుతారు. పశువుల మూత్రము, పేడ ఇతర ఆకువ్యర్థాలతో కలిసి మరుసటి రోజు ఉదయానికి ఎరువు గుంతలలోనికి వెళుతుంది. కొంతకాలం ఇలా సేకరించిన ఆకులు, పేడ మూత్రము తిరిగి వ్యవసాయ భూములకు ఎరువుగా ఉపయోగపడతాయి.

ఈ ఉమ్మడి భూములు ప్రకృతి విపత్తుల బారిన



పడినప్పుడు పశుగ్రాసం లభ్యత తగ్గిపోతుంది. దీని కారణంగా ఉమ్మడి భూముల నుంచి వ్యవసాయ భూములకు పోషక బదిలీ జరగదు. ఇందువల్ల వ్యవసాయ దిగుబడి తగ్గుతుంది. చెట్లనుంచి రాలిన ఆకులు జీవ పదార్థం తేమతో కూడిన దట్టమైన చాప మాదిరి ఏర్పడి పోషక విలువలున్న మట్టిగా తయారవుతుంది. అలా కిందపడ్డ ఆకులు, కొమ్మలు, చెద పురుగులు. సూక్ష్మజీవుల (వానపాములు, పేడ పురుగులు) వల్ల కుళ్ళిపోతాయి. వ్యవసాయ పొలాల గట్లపైన చెట్లు, పొదలు ఉన్నట్లయితే ఈ పోషకాల బదిలీ వ్యవసాయ భూములలో కూడా గమనించవచ్చు.

**పోషకాల పునర్వినియోగం :** చెట్లు వాటి వేర్ల ద్వారా లోతైన భూమి పొరలలోని మట్టి నుంచి సూక్ష్మ పోషకాలను గ్రహిస్తాయి. ఇలా గ్రహించిన పోషకాలను ఆకుల ద్వారా భూమిపైకి తీసుకుని వచ్చి ఆకు రూపంలో ఇతర మొక్కలకు అందిస్తుంది. ఉదాహరణకు: ఒక చెట్టు మట్టి నుంచి వంద కేజీల పోషకాలను గ్రహిస్తుందనుకుంటే అది తన జీవిత కాలంలో ఆకుల, కొమ్మల రూపంలో ఆ వంద కేజీలకు పది రెట్ల కంటే ఎక్కువ పోషకాలను ఇస్తుంది.


ఉమ్మడి భూములు పైన పేర్కొన్న ప్రాకృతిక సేవలు (సంపర్కం. చీడ పీడల నివారణ, పోషక బదిలీ, పోషకాల పునర్వినియోగం) నిరంతరంగా కొనసాగాలంటే ప్రజలు సమైక్యంగా కట్టుబాట్లను ఏర్పాటు చేసుకుని గ్రామ స్థాయిలో సహజ వనరుల యాజమాన్యంలో చురుకైన పాత్ర పోషించాలి. ఉమ్మడి భూములకు, వ్యవసాయానికి మధ్య ఉన్న సంబంధాలను బలపరుచుటకు వ్యవసాయ భూములు, ఉమ్మడిభూములు (0.5–0.8) నిష్పత్తిని స్థిరంగా ఉంచుటకు, పెంచుటకుగల ఏకైక మార్గం ఉమ్మడి భూముల పునరుజ్జీవం. ■

జీవితమంటే గొప్ప పాండిత్యమో, ఆభరణాలో, ఆడంబరంగా బతకడమో కాదు; ఇతరులకు నీవు పంచే ఆనందం మాత్రమే

# వాటర్‌షెడ్ గ్రామాల్లో విత్తన పొట్టేళ్ళ పంపిణీ !

– ఎన్. ప్రహ్లాదయ్య




గ్రామీణ ప్రాంతాలలో పొట్టేళ్ళ అభివృద్ధి పథకంలో భాగంగా చిత్తూరు జిల్లా రామసముద్రం మండలంలోని చొక్కాండ్లపల్లి మెగా వాటర్‌షెడ్ గ్రామాలలోని 94 కుటుంబాలకు రూ. 9,40,000 విలువకలిగిన పొట్టేళ్ళను పంపిణీ చేశారు. మెగా వాటర్ షెడ్‌లో ఉత్పాదకత పెంపుదల కార్యక్రమంలో భాగంగా ఈ పొట్టేళ్ళ పంపిణీ జరిగింది. ఏ ప్రాంతంలోని పొట్టేళ్ళను ఆ ప్రాంతంలోనే గొర్రెల సంతతి పెంపుదలకు ఉపయోగించడం వల్ల ఆరోగ్యవంతమైన గొర్రెల సంతతి అభివృద్ధి చెందడం లేదు. ఒకే మందలోని పొట్టేళ్ళు తరచూ దాటడం వల్ల గొర్రెల సంతతి బలహీనపడుతుందని వివిధ పరిశోధనలు తెలుపుతున్నాయి. ఫలితంగా రైతులకు ఆశించిన ఆదాయాలు రావడం లేదు.

ఇతర ప్రాంతాల పొట్టేళ్ళను తెచ్చి విత్తన పొట్టేళ్ళుగా వినియోగిస్తే ఆరోగ్యకరమైన గొర్రెల సంతతి అభివృద్ధి చెందుతుంది. అందువలన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పశువైద్య విశ్వ విద్యాలయం సాంకేతిక సలహాతో ఇక్కడికి వందల కిలోమీటర్ల దూరంలో ప్రకాశం జిల్లాలోని చంద్రశేఖర పురంలో (సి ఎస్ పురం) పెంచుతున్న పొట్టేళ్ళను చిత్తూరు జిల్లా పశువైద్య శాఖ ద్వారా కొనుగోలు చేసి 94 కుటుంబాలకు పంపిణీ చేయడం జరిగింది. ప్రతి కుటుంబానికి రూ. 10,000ల విలువ గల పొట్టేళ్ళను అందజేశారు. ఇందులో షెడ్యూల్డ్ కులాల వారు 10%, ఇతరులు 20% సభ్యత్వ వాటా చెల్లించారు. మిగిలిన మొత్తం ప్రభుత్వ గ్రాంట్. అందువలన సభ్యులు చెల్లించవలసిన అవసరం లేదు. పొట్టేలు చనిపోతే రైతులు నష్టపోకుండా ఈ పొట్టేళ్ళకు ఒక సంవత్సర కాలానికి బీమా చేయించి రైతులకు అందజేశారు.

పెద్ద మందలున్న రైతులు తరచుగా పొట్టేళ్ళను మార్చుకోవాలని వారికి అవగాహన కలిగించే కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'పల్లె జీవం' పథకంలో భాగంగా చేపట్టారు. ■







ఆశాభావాన్ని మించిన కానుక లేదు, అనుభవ పాఠాలు నేర్పుతూ పరాజయం నుంచి విజయానికి చేర్చే నిచ్చెన అది







*ప్రపంచ సహకార సదస్సులో వివిధ ప్రతినిధులతో శ్రీ సి ఎస్ ...ప్రసంగిస్తున్న శ్రీమతి వందనా శివ*

# ప్రపంచ సహకార సదస్సులో సి.ఎస్. ప్రసంగం!

**2**019 అక్టోబర్ 14-17 తేదీలలో ఆఫ్రికా ఖండంలోని రవాండాకు చెందిన కిగాలి నగరంలో 'ఇంటర్నేషనల్ కోఆపరేటివ్ అలయెన్స్' (ఐ సి ఏ) ఆధ్వర్యంలో 'సహకార సంస్థలు అభివృద్ధి కోసం' అనే అంశంపై ప్రపంచ సదస్సు జరిగింది. ఈ సదస్సులో 'మహిళాభివృద్ధి సొసైటీ' (మాస్) ఎండి, సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఆహ్వానిత ప్రధాన వక్తగా పాల్గొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలకు చెందిన వెయ్యిమందికిపైగా ప్రతినిధులు పాల్గొన్న ఈ సదస్సులో శ్రీ సి ఎస్ రెడ్డి అక్టోబర్ 15 వ తేదీన 'మహిళా సాధికారత-సుస్థిరాభివృద్ధి అగ్రగామి' అనే అంశంపై ప్రధాన ప్రసంగం చేశారు. ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో ఒకటైన 'లైంగిక సమానత్వం' సాధనకు దోహదకారిగా మహిళల ఆర్థిక, రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంపొందించడంలో సహకార వ్యవస్థ నమూనా ఏ విధంగా మెరుగైన తోడ్పాటును అందించగలుగుతున్నదో శ్రీ సి ఎస్ రెడ్డి తన ప్రసంగంలో వివరించారు.

విధాన రూపకర్తలు, సంస్థల ప్రతినిధులు, సహకార ఉద్యమభాగస్వాములు, సామాజిక సంస్థల ప్రతినిధుల మధ్య పరస్పర అవగాహనాపూరిత వాతావరణంలో సంబంధిత వివిధ అంశాలపై ఎటువంటి అరమరికలు లేకుండా స్వేచ్ఛగా చర్చలు జరగాలన్నది ఐ సి ఏ ఆశయం. అందుకు అనుగుణంగా ప్లీనరీ సమావేశాలు, చర్చాగోష్ఠులు, ప్రాధాన్యతాంశాలపై సెమినార్లు మొదలైన వాటిని ఈ సదస్సులో నిర్వహించారు.

భారతదేశానికి చెందిన ప్రపంచ ప్రసిద్ధ పర్యావరణ ఉద్యమకారిణి, ప్రపంచమంతటా ఆకలికి తావులేని ఆహార భద్రత ఏర్పడాలన్న ఆశయశీలి, మేధావి శ్రీమతి వందనా శివ కూడా ఈ సదస్సులో ప్రసంగించడం ఒక విశేషం. ■






ఆచరణ తగ్గి ఆకాంక్ష పెరిగితే అది తీరని ఆందోళన ; ఆకాంక్షను మించి ఆచరణ ముందడుగేస్తే అది విజయం

# పాలేకర్ విధానంలో రసాయన రహిత సాగు !

రసాయనాలు క్రిమి సంహారకాలతో పండించిన పంటలను ఆహారంగా తీసుకుని ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. బంగారం పండే భూములు నిస్సారంగా మారుతున్నాయి. ఈ పరిస్థితిలో మార్పు తెచ్చేందుకు సుభాష్ పాలేకర్ ప్రకృతి వ్యవసాయ విధానాన్ని ప్రచారం చేశారు. ఆయన స్ఫూర్తితో ప్రకృతి సేద్యం చేస్తూ రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు నెల్లూరు జిల్లా కొండాపురం మండలం శెట్టిపాలెం పంచాయతీ తూర్పు జంగాలపల్లెలో వున్న వ్యవసాయ క్షేత్ర ఇన్‌చార్జి క్రాంతి.



విజయవాడకు చెందిన 11 మంది రైతులు ప్రకృతి వ్యవసాయం మీద మక్కువతో 'లక్ష్మీ పెరల్స్ రైతుమిత్ర సంఘం'గా ఏర్పడ్డారు. నెల్లూరు జిల్లా తూర్పు జంగాలపల్లెలో 150 ఎకరాల వ్యవసాయ భూమి కొనుగోలు చేసి వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. ఈ క్షేత్రంలో 11 ఎకరాలలో జామతోట 40 ఎకరాలలో సీతాఫలం, 35 ఎకరాలలో బత్తాయి, 3 లేయర్ విధానంలో 84 ఎకరాలలో మిశ్రమ పండ్లతోటలు, ఒక ఎకరంలో షేడ్‌నెట్ విధానంలో కూరగాయలు సాగు చేస్తున్నారు. రసాయనాలు వాడకుండా జీవామృతం, నీమాస్త్రం, దశపత్ర కషాయాలను మాత్రమే మొక్కలకు వాడుతున్నారు. దేశీ ఆవులను పెంచుతూ ఈ కషాయాలను క్షేత్రంలోనే తయారు చేసుకుంటున్నామని తెలిపారు క్షేత్రం ఇన్‌ఛార్జి ఆర్. క్రాంతి.

ఈ కాలంలో వాతావరణంలో విపరీతమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అధిక ఎండ తీవ్రతను, అలాగే అతి శీతలాన్ని తట్టుకోవడం మొక్కలకు అసాధ్యంగా మారుతోంది. ఈ పరిస్థితిని నివారించి మొక్కలకు నిరంతరం సమతుల ఉష్ణోగ్రత ఉండేలా షేడ్‌నెట్ ఉపయోగపడుతుంది. వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల మేరకు ఈ క్షేత్రంలో షేడ్‌నెట్స్ ఏర్పాటుచేశారు. 4000 చదరపు అడుగులను మూడు భాగాలుగా విభజించి ఇనుపరాడ్లు అమర్చి సమతులంగా ఎండ తగిలే విధంగా నెట్లను ఏర్పాటుచేశారు. ఈ నెట్లద్వారా వచ్చే సూర్యరశ్మితో మొక్కలు కిరణజన్య సంయోగక్రియ ద్వారా వాటికి కావాల్సిన ఆహారాన్ని తయారు చేసుకుంటాయి. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టాలు జరిగినా రైతుకు ఇబ్బంది లేకుండా బీమా సౌకర్యం కల్పించారు. షేడ్‌నెట్లను ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇస్తుంది. 4000 చదరపు అడుగులకు మొత్తం ఖర్చు రూ 28 లక్షలు కాగా రూ.14 లక్షలు ప్రభుత్వ రాయితీగా లభించిందని నిర్వాహకులు వివరించారు. వ్యవసాయ శాస్త్రవేత్త సుభాష్ పాలేకర్ వద్ద శిక్షణ తీసుకున్నానని, ఆ అనుభవంతో సొంతంగా గో ఆధారిత ఎరువులు తయారు చేసుకుంటున్నట్లు క్రాంతి తెలిపారు.

**ఏడాదంతా ఒకే ధరకు విక్రయం**

క్షేత్రంలో క్యాబేజీ, క్యాలీఫ్లవర్, మిర్చి, క్యాప్సికమ్, టమోటా, బెండ పంటలను షేడ్‌నెట్ విధానంలో సాగు చేస్తున్నారు. రసాయనాలు వాడిన విధానంలో ఎంత దిగుబడి వస్తుందో అదే స్థాయిలో ప్రకృతి వ్యవసాయం ద్వారా దిగుబడి సాధిస్తున్నారు ఈ యువరైతులు. ఈ క్షేత్రంలో పండించిన కూరగాయలను నెల్లూరులోని రైతుబజారుకు తరలిస్తున్నారు. క్షేత్రానికి వచ్చిన రైతులకు కేజీ రూ.30 లకు, వ్యాపారస్తులకు రూ.25 లకు ఏడాది పొడవునా ఒకే ధరకు విక్రయించాలని నిర్ణయించడం విశేషం.

**నేలకు, పంటకు అమృతాలు**

జీవామృతం: 200 లీటర్ల నీటికి 5 కేజీల తాజా ఆవుపేడ, 3 నెలల పాటు నిల్వవున్న 10 లీటర్ల ఆవు

# సేంద్రియ విధానంలో 50 రకాల పండ్లు, అరుదైనపంటలు !

సేంద్రియ విధానంలో 50 రకాల పండ్ల మొక్కలు పెంచడంతో పాటు వరి, కంది, కలప మొక్కల సాగుతో లాభాలు ఆర్జిస్తున్నారు రంగారెడ్డి జిల్లాకు చెందిన యువరైతు బొల్లంపల్లి ప్రసాద్‌రెడ్డి. తక్కువ ఖర్చుతో అధిక లాభాలు ఆర్జించే అవకాశం ఉన్న సేంద్రియ సేద్యం రైతులందరికీ ఆచరణీయం అంటున్నారాయన.

మేడ్చల్ జిల్లా, మూడుచింతలపల్లి మండలం ఉద్దెమర్రి గ్రామానికి చెందిన బొల్లంపల్లి ప్రసాద్‌రెడ్డికి రెండెకరాల పొలం ఉంది. పూర్వీకులు దశాబ్దాలుగా రసాయన సేద్యం చేయడంతో భూసారం క్షీణించి, దిగుబడులు గణనీయంగా తగ్గడం మొదలైంది. సుభాష్ పాలేకర్ వ్యవసాయ విధానం గురించి తెలుసుకున్న ప్రసాద్‌రెడ్డి సేంద్రియ సేద్యం చేయాలని సంకల్పించారు. నాలుగేళ్లుగా తన పొలంలో సేంద్రియంగా 50 రకరకాల పండ్ల మొక్కలు, ఔషధ మొక్కలు, కలపతో పాటు కంది, వరి పంటలను సాగు చేస్తూ మంచి లాభాలతో పాటు కొండంత సంతృప్తిని పొందుతున్నారు. “గట్టి సంకల్పం ఉంటే ఎవరైనా సేంద్రియ సేద్యం చేపట్టవచ్చు.

రసాయన సేద్యం భూసారంతో పాటు రైతులను పీల్చి పిప్పి చేస్తున్నది. ప్రతి ఒక్కరైతూ సేంద్రియ సేద్యం చేయాలి. అప్పుడే ముందుతరాలకు ఆరోగ్యవంతమైన ఆహారాన్ని, సారవంతమైన భూమిని అందించగలుగుతాం” అంటారు ఆ యువరైతు. “ఈ కాలంలో ఎక్కువ శాతం మంది రైతులు విత్తనాలను బయట నుంచి కొంటున్నారు. నిజానికి విత్తనాలను మనమే సిద్ధం చేసుకోవచ్చు. ఎలాంటి రసాయనాలు ఉపయోగించకుండా పంటలు పండించు కోవచ్చు. ఒక దేశీ ఆవు వుంటే చాలు కేవలం 150 రూపాయల ఖర్చుతో జీవామృతం, ఘన జీవామృతాలను సిద్ధం చేసుకుని, ఎలాంటి రసాయనాలు లేకుండా ఆరోగ్య వంతమైన పంటలను పండించుకోవచ్చు” అంటారాయన.

నేలలో ఉండే చెడు బ్యాక్టీరియా మొక్కపై ప్రభావం చూపకుండా జీవామృతం కాపాడుతుంది. ఈ ఎరువుతో పండించిన పంటను విత్తనంగా ఉపయోగించుకుంటే ఖర్చు తగ్గడంతో పాటు మంచి దిగుబడికి భరోసా ఉంటుందంటారు ప్రసాదరెడ్డి. సేంద్రియ సేద్యంలో కీలకమైన జీవామృతాన్ని ఎవరైనా సులభంగా తయారు చేసుకోవచ్చు. జీవామృతం మూత్రం, 2 కేజీల నల్లబెల్లం, 2 కేజీల ద్విదళ ధాన్యాల పిండి, దోసెడు పుట్టమట్టిని కలిపి 48 గంటలు నిల్వ వుంచితే జీవామృతం తయారవుతుంది. 9 రోజుల తర్వాత మొక్కలకు వాడుకోవచ్చు. రైతుమిత్ర జీవులకు ఇది ఆకర్షక అమృతంగా పని చేస్తుంది.

**నీమాస్త్రం:** 200 లీటర్ల నీటికి 10 కేజీల వేప ఆకు, 2 కేజీల తాజా ఆవుపేడ, ఒక లీటరు నిల్వ వున్న ఆవు మూత్రం కలిపి నీమాస్త్రం తయారు చేస్తారు. ఈ మిశ్రమం సకల రైతు శత్రు కీటక నాశనులను గుడ్డు దశలోనే నాశనం చేస్తుంది. అలాగే వాసన రూపంలో కీటకాలకు వికర్షిణిగా పనిచేస్తుంది.

**దశపత్ర కషాయం:** మేకలు తినని 10 రకాలైన ఆకులు, 2 కేజీల ఆవుపేడ, 10 లీటర్ల ఆవుమూత్రం, వెల్లుల్లి పేస్ట్, 2 కేజీల పచ్చి లేదా ఎండు మిరపకాయల మిశ్రమాన్ని 40 రోజుల పాటు నిల్వ చేసుకొని వాడుకోవచ్చు. 5 లీటర్ల నీటిని 100 లీటర్ల నీటికి కలిపి మొక్కలకు స్ప్రే చేయాలి. రైతు శత్రుకీటకాలను పారద్రోలడంలో ఈ కషాయం అద్భుతంగా పని చేస్తుంది.

**పదిమందికీ పాలేకర్ విధానం**

తాను డిగ్రీ చదువుకున్నానని, ప్రకృతి సేద్యంపై వ్యవసాయ శాస్త్రవేత్త సుభాష్‌పాలేకర్ వద్ద శిక్షణ పొందానని, రసాయన ఎరువులు, క్రిమిసంహారకాలు ఉపయోగించ కుండా కేవలం గోఆధారిత ఎరువులతో సేద్యం చేస్తున్నానని క్షేత్ర ఇన్‌ఛార్జ్ శ్రీ ఆర్.క్రాంతి తెలిపారు. ప్రకృతి వ్యవసాయం లో మెళకువలు తెలుసుకోవడంతో పాటు ఆసక్తి వున్న రైతులకు తమ అనుభవాలను పంచుతున్నామని ఆయన అన్నారు. ■

పరాజయానికి దారులు అనేకం, కాని విజయానికి ఒకే రహదారి



తయారీకి 200 లీటర్ల నీరు, 2 కిలోల శనగపిండి, 2కిలోల బెల్లం, 10 కిలోల గోపేడ, 10 లీటర్లు గోమూత్రం, పిడికెడు పుట్టమన్ను లేక గట్టుమన్ను కావాలి. ముందుగా ఆవు పేడను మెత్తగా చేసి డ్రమ్ములో వేసి సగం నీళ్లలో కలపాలి. అలాగే శనగపిండి, బెల్లం, గోమూత్రం, పిడికెడు పుట్టమన్ను వేసి బాగా కలపాలి.

ప్రతిరోజు మూడుసార్లు సవ్యదిశలో కర్రతో కలియ తిప్పాలి. దీనిపై ఎండ, వర్షం పడకుండా గుడ్డను కప్పాలి. వారం రోజులు మురిగిన తరువాత జీవామృతం తయారవు తుంది. దీన్ని మొక్కలకు ఎరువుగా వాడుకోవాలి. దీంతో మొక్కలు బలవర్ధకంగా పెరగడంతో పాటు చీడపీడలు దరి చేరకుండా ఉంటాయన్నారు ఈ యువరైతు. తన పొలంలో స్టార్ ఫ్రూట్, వాటర్ ఆపిల్, పనస, జీడి మామిడి, రస్‌బెర్రీ, సీతాఫల్, మామిడి, అల్లనేరేడు, సపోట, బ్రెడ్ ఫ్రూట్‌తో పాటు ఔషధ మొక్కలైన లెమన్‌గ్రాస్, లవంగ తులసి, సరస్వతీ ఆకు వంటి పలు రకాల అరుదైన పంటలను పండిస్తున్నారు ప్రసాద్‌రెడ్డి. వీటితో పాటు కలప మొక్కలను పెంచుతున్నారు. సేంద్రియంగా వరి, కంది పంటలను పండిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు.

**సేంద్రియం ఉత్తమం: ప్రసాద్‌రెడ్డి**

నేలతల్లిని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్క రైతుది. రసాయన ఎరువులు వాడడంతో భూములు దేనికీ పనికి రాకుండా పోతున్నాయి. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేందుకు సేంద్రియ సేద్యం ఉత్తమం. భూమిలో ఉండే పోషక విలువలు పాడవకుండా ఉండాలంటే ఇదే మేలైన మార్గం. నాలుగేళ్లుగా సేంద్రియ వ్యవసాయం చేస్తున్నాను. ఈ బాటలో నడిచే వారికి సూచనలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాను. **(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో ...)**

## అరబిందో, మాస్ సహకారంతో పాఠశాలకు వసతుల కల్పన



**చి**త్తూరు జిల్లా పీలేరు మండలం గూడరేవుపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలకు అరబిందో ఫార్మా, మహిళాభివృద్ధి సొసైటీ (మాస్) సంస్థల ఆధ్వర్యంలో పది లక్షల రూపాయల వ్యయంతో తరగతి గదులు, బోర్‌వెల్, డెస్క్‌లు, విద్యుదీకరణ, ఫ్యాన్ల వితరణతో పాటు విద్యార్థులకు నోటు పుస్తకాలను, ఇతర విద్యా ఉపకరణాలను అందజేశారు. ఈ సందర్భంగా అక్టోబర్ 19 వ తేదీన ఆ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అరబిందో ఫార్మా వైస్ ఛైర్మన్ శ్రీ నిత్యానందరెడ్డి, మాస్ ఎం డి, సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ప్రభృతులు పాల్గొని ఈ పాఠశాలలో విద్యార్థులకు అన్ని ఆధునిక వసతులతో కూడిన నాణ్యమైన విద్య అందేలా చూడడానికి తమ తోడ్పాటు కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ ఎం కె ఎస్ ఫౌజియా బేగం, ఉపాధ్యాయులు మదనమోహనరెడ్డి, శ్రీనివాసులురెడ్డి ప్రభృతులు పాల్గొన్నారు. ■



*కలికిరి వ్యవసాయ ఉత్పత్తిదారుల మహాసభలో ప్రసంగిస్తున్న మాస్ సి ఇ ఒ శ్రీ సి ఎస్ రెడ్డి. కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ గణేశ్ కుమార్ ప్రభృతులను చిత్రంలో చూడవచ్చు*

సమాజం మచ్చికచేసిన జంతువే మనిషి ; న్యాయం, చట్టం అనేవే లేకుంటే మనిషిని మించిన క్రూర జంతువు మరి లేదు

# కరువు నేలకు కనకం ఎర్రచింత!

## అనంతపురం శాస్త్రవేత్తల కృషి ఫలితం .... ' ఛాంపియన్ ట్రీ ' ఆవిష్కరణ !

తీవ్ర కరువు, గాలివానలు వంటి తీవ్రమైన ప్రకృతి వైపరీత్యాలను సైతం తట్టుకోవడంతో పాటు రైతుకు స్థిరంగా ఏటేటా మంచి ఆదాయాన్నివ్వగలిగిన మంచి తోట పంట 'ఎర్ర చింత'. దీని అసలు పేరు 'అనంత రుధిర'. ఇది సహజ రకమే. అనంతపురం ఉద్యాన పరిశోధనా స్థానం శాస్త్రవేత్తల కృషి ఫలితంగా వెలుగులోకి వచ్చింది. దేశవ్యాప్తంగా



అధికారికంగా విడుదలైంది. ఈ చింతపండు ఎరుపు రంగులో ఉండటం, సాధారణ చింతలో కన్నా పోషక విలువలు అధికంగా కలిగి ఉండడంతో ఇతర ఉత్పత్తుల్లో కలపడానికి.. అంటే విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి ఇది బాగా అనుకూలమైనది. బత్తాయి తదితర పండ్ల తోటలు ఎండిపోతున్న తీవ్ర కరువు పరిస్థితుల్లోను, గాలివానలకు తట్టుకొని దిగుబడిని ఇవ్వగలగడం దీని ప్రత్యేకత.

చింతపండుతో దక్షిణాదిప్రజలకు, రైతులకు విడదీయరాని అనుబంధం ఉంది. కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో చింత సాగు జరుగుతోంది. ఇంట్లో రోజువారీ వంటల్లో వాడుకోవడానికి, నిల్వపచ్చడి పెట్టుకోవడానికి మాత్రమే చింతపండును ప్రస్తుతం మనం వాడుతున్నాం. చింతపండు అంటే నల్లగానే ఉంటుంది కదా అనుకోవద్దు. ఎందుకంటే ఇటీవలే ఎర్రని చింత రకం ఒకటి వెలుగులోకి వచ్చింది.

మామూలు చింత రకాలకు భిన్నంగా ఎర్ర చింత రకాన్ని అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం రేకులకుంటలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు వెలుగులోకి తెచ్చారు. పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి. శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఐదేళ్లపాటు కొనసాగిన పరిశోధనల ఫలితంగా ఎరుపు రంగులో ఉండే చింత రకం రైతులకు అందుబాటులోకి వచ్చింది. 'అనంత రుధిర' అనే పేరుతో ఈ కొత్త రకాన్ని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి దేశవ్యాప్తంగా విడుదల చేసింది.

దేశవ్యాప్తంగా ఇప్పటివరకూ ఉద్యాన శాస్త్రవేత్తలు విడుదల చేసిన చింత రకాలు రెండే రెండు. ఉత్తరప్రదేశ్లో యోగేశ్వర్ అనే రకం (దీని వివరాలు పెద్దగా అందుబాటులో లేవు) మొదటిది కాగా, మన అనంతపురం శాస్త్రవేత్తలు గుర్తించి, అభివృద్ధి చేసి వెలుగులోకి తెచ్చిన 'ఎర్ర చింత' (అనంత రుధిర) రెండోది కావడం విశేషం. రేకులకుంటలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా స్థానంలో 40కి పైగా రకాల చింతచెట్లను సాగు చేస్తూ పరిశోధనలు సాగిస్తున్నారు. వీటిలో 30 ఏళ్ల వయసున్న ఒక చెట్టు కాయల్లో గుజ్జు ఎర్రగా ఉన్నట్లు, ఈ చెట్టు ప్రతి ఏటా కాయలు కాస్తున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు.



దీనికి 'ఛాంపియన్ ట్రీ' అని పేరు పెట్టి ప్రత్యేకంగా చూసుకుంటున్నారు. ఈ చెట్టు కొమ్మల ద్వారా అంట్లను ఉత్పత్తి చేస్తూ రైతులకు అందిస్తున్నారు. ఈ ఏడాది కనీసం

20వేల అంట్లు ఉత్పత్తి చేయాలనుకుంటున్నారు. గత కొన్నేళ్లుగా ఈరకం మొక్కలు కొన్నిటిని ఈ పరిశోధనాస్థానంలో నాటారు. అవి పూతకు వచ్చిన తర్వాత ఆ చెట్లకు కూడా అంట్లు కట్టడం ప్రారంభిస్తామని డా. శ్రీనివాసులు తెలిపారు. 'అనంత రుధిర' రకంతోపాటు సాధారణరకాలైన తెట్టు అమాలిక, ధార్వాడ్ సెలక్షన్-1, ధార్వాడ్ సెలక్షన్-2 చింత రకాల అంటుమొక్కలు కూడా రేకులకుంటలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా స్థానంలో అందుబాటులో ఉన్నాయి.

**ఎర్ర చింతకు గుత్తులుగా కాయలు**

ఉద్యాన క్షేత్రంలో ఉన్న అనంత రుధిర రకం ప్రతి ఏటా కాపు కాస్తున్నది. కాయలు గుత్తులు గుత్తులుగా వస్తాయి. పిందెను విరిచి చూస్తే రక్తం మాదిరిగా ఎర్రగా కండ కనిపిస్తుంది. కాయ ముదిరిన తర్వాత రోజ్ రెడ్లోకి మారుతుంది. యాంటోసైనిన్స్ అనే పిగ్మెంట్ కారణంగా ఎరుపు రంగు సహజసిద్ధంగానే వస్తున్నదని డా. శ్రీనివాసులు తెలిపారు.

**ఆరోగ్యదాయకం**


మామూలు చింత రకాల నుంచి వచ్చే చింతకాయల ద్వారా చింతతొక్కు, చింతపండుగానే ఎక్కువగా ఆహారంలో ఉపయోగిస్తారు. అయితే, ఎర్రచింతతో అనేక ఉత్పత్తులను తయారు చేసుకోవచ్చు. ఈ రకం చింతపండు, ఇతర ఉత్పత్తులు ఆరోగ్యపరంగా మనిషి ఎంతగానో మేలు చేస్తాయని శాస్త్రవేత్తలు తెలిపారు. ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేసే యాంటీ ఆక్సిడెంట్స్ ఇందులో పుష్కలంగా ఉంటాయి. మానవ శరీరంలో ఉన్న ఫ్రీ రాడికల్స్ (చెడు కలిగించే పదార్థాలు) ను ఇవి నిర్వీర్యం చేస్తాయని శాస్త్రవేత్తలు తెలిపారు. అలాగే ఇందులో టార్టారిక్ యాసిడ్, భాస్వరం, పొటాషియం, నియాసిన్, రెబోఫ్లేవీన్, బీటా కెరోటిన్ లాంటి విటమిన్లు, మినరల్స్(ఖనిజాలు) ఉన్నట్లు తేలింది. మరీ ముఖ్యంగా టార్టారిక్ యాసిడ్ 16 శాతం ఉంటుంది. దీన్ని చింత తొక్కుగా, చింతపండుగా వంటకాల్లో వాడితే మంచి రుచిని ఇస్తుందన్నారు.

**ఆకర్షణీయంగా ఆహారోత్పత్తులు**

ఎరుపు రంగు ఆక్షణీయంగా ఉంటుంది కాబట్టి ఎర్ర చింతపండుతో పులిహోర, సాంబారును మరింత ఆకర్షణీయంగా తయారు చేసుకోవచ్చు. అంతేకాదు.. ఎర్ర చింతపండును వినియోగించి జామ్, జెల్లీ, సాస్, చిక్కటిగుజ్జు, పొడి, టోఫీస్(చాక్లెట్లు), బేకరీ పదార్థాల తయారీలో వాడుకుండే ఆయా ఉత్పత్తులు సహజమైన ఎర్ర రంగుతో అదనపు పోషక విలువలతో కూడి మరింత ఆకర్షణీయంగా మారుతాయని డా. శ్రీనివాసులు అంటున్నారు. ఎగుమతుల పెరుగుదలకు కూడా అవకాశం ఉంటుంది.

**ఐదో ఏడాది నుంచి దిగుబడి**

'అనంత రుధిర' రకం సాగుకు అన్ని రకాల నేలలు అనుకూలమైనవే అయినప్పటికీ, ఎర్రగరప నేలలు, తేలికపాటి నల్ల రేగళ్లలో మంచి దిగుబడులు వస్తాయని డా.శ్రీనివాసులు తెలిపారు. సాధారణంగా చింత మొక్కలను చౌడు నేలల్లోనో, వ్యవసాయానికి పనికిరాని భూముల్లోనో నాటుతూ ఉంటారని.. అయితే సాగు యోగ్యమైన భూముల్లో ఇతర తోట పంటల మాదిరిగానే చింత అంట్లను నాటుకొని, డ్రిప్ ద్వారా నీటిని, ఎరువులను అందిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని ఆయన అంటున్నారు. సాళ్ల మధ్య, మొక్కల మధ్య 8 మీటర్ల ఎడంలో ఎకరాకు 62 మొక్కలు నాటుకోవచ్చు.



చెట్లు, కొమ్మలు గుబురుగా, దట్టంగా పెరుగుతాయి, కొన్ని దశాబ్దాల పాటు పెద్ద చెట్లుగా ఎదుగుతాయి కాబట్టి ఎటు చూసినా 8 మీటర్ల దూరంలో చింత మొక్కలు నాటుకోవాలన్నారు. మొక్కలు నాటిన తర్వాత ఐదో ఏడాది కాపునకు వస్తాయి. పూత వచ్చిన 7-8 నెలలకు పండ్లు తయారవుతాయి. తొలి ఏడాది చెట్టుకు 15-20 కిలోల చింతపండ్ల దిగుబడి వస్తుంది. 10-12 సంవత్సరాల చెట్టు ఏటా 40-50 కిలోల దిగుబడినిస్తుంది. 20 సంవత్సరాల నుంచి ఒక్కో చెట్టుకు ఏటా 70-80 కిలోల చొప్పున చింత పండ్ల దిగుబడి వస్తుంది.

చింత పండ్లను సేకరించి పైన పొలు, ఈనెలు, గింజలు తీసేస్తే.. 40-45 శాతం మేరకు నికరంగా చింతపండు చేతికి వస్తుందని డా. శ్రీనివాసులు తెలిపారు. ఏటా కాపు

ప్రతీకారం తీర్చుకుంటే నీకు హాని చేసినవారితో నీవూ సమానమే , మన్నించగలిగితే వారికంటె నీవు ఎంతో అధికం




చెక్కతో పాటు తగిన మోతాదులో రసాయన ఎరువులు వేసుకోవాలని డా. శ్రీనివాసులు సిఫారసు చేస్తున్నారు. అయితే, ప్రకృతి లేదా సేంద్రియ వ్యవసాయ పద్ధతులను పాటించే రైతులు తమ పద్ధతుల ప్రకారం ఎరువులను, కషాయాలను వాడుకుంటూ చింత తోటలు సాగు చేసుకోవచ్చు.

**ఎర్ర గరప, రేగడి నేలలు అనుకూలం**

ఎర్ర చింత చెట్ల సాగుకు ఎర్ర గరప నేలలతోపాటు తేలికపాటి నల్లరేగడి నేలలు అనుకూలమని, కోస్తా ప్రాంతాల్లో సారవంతమైన భూముల్లో అయితే మెట్ట ప్రాంతాల్లో కన్నా అధిక దిగుబడి కూడా రావచ్చునని అనంతపురం జిల్లా రేకులకుంటలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ బి. శ్రీనివాసులు తెలిపారు. ఈ పంటను గురించి ఆయన మరిన్ని వివరాలను ఇలా తెలిపారు : గాలి వానలకు దీని కాయలు పండిన దశలో కూడా రాలిపోవు. తక్కువ వర్షపాతం ఉండే రాయలసీమ వంటి ప్రాంతాల్లో తీవ్ర కరువు పరిస్థితులను సైతం తట్టుకొని బతుకుతుంది. అందువల్లనే బత్తాయి, దానిమ్మ, నిమ్మ తోటలు ఎండిపోతున్న ప్రాంతాల్లో రైతులు ఇటీవల కాలంలో చింత మొక్కలు నాటుకుంటున్నారు. ఇతర తోటల్లో మాదిరిగా డ్రిప్ పెట్టుకొని, ఎరువులు వేసుకొని కొంచెం శ్రద్ధ చూపితే ఎటువంటి భూముల్లోనైనా చక్కగా పెరిగి దశాబ్దాలపాటు లాభదాయకమైన దిగుబడినిస్తుంది. ఎర్ర చింత అంటు మొక్కలకు రైతుల నుంచి ఇప్పటికే గిరాకీ బాగా వచ్చింది. తెలంగాణ ఉద్యాన శాఖ వారు కూడా 3 వేల మొక్కలకు ఆర్డర్ ఇచ్చారు. వచ్చే నెలలో వారికి సరఫరా చేస్తున్నాం. టిష్యూ కల్చర్ పద్ధతి విజయవంతం కాకపోవడంతో అంటు మొక్కలనే రైతులకు అందిస్తున్నాం. ఎర్రచింతపండును వంటకాల్లో చింతపండుగా కాకుండా విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీలో వాడటానికి ఎక్కువ ఉపయోగపడుతుంది. ఎగుమతి అవకాశాలు కూడా ఎక్కువే.

**(సాక్షి సౌజన్యంతో ...)**

■

కాయడం ఈ రకం విశిష్టత కావడంతో రైతుకు లాభదాయకంగా ఉంటుంది. అంటు మొక్కలు నాటుకుంటే 70–80 ఏళ్ల వరకు దిగుబడినిస్తాయి. చింత గింజలు నాటితే చెట్లు 10–12 ఏళ్లకు గానీ కాపునకు రావు. కానీ, వందేళ్ల వరకు దిగుబడినిస్తాయి. అయితే, గింజ నాటినప్పటికన్నా అంటు నాటుకున్నప్పుడు జన్యుపరంగా ఖచ్చితమైన నాణ్యమైన చెట్లు రావడానికి అవకాశం ఉందన్నారు.

**అంతర పంటలుగా పప్పు ధాన్యాలు**


చింత మొక్కల మధ్య ఎటుచూసినా 8 మీటర్ల దూరం ఉంటుంది కాబట్టి.. మామిడి, చీనీ తోటల్లో మాదిరిగానే.. చింత తోటలు నాటిన కొన్ని ఏళ్ల పాటు రైతులు నిశ్చింతగా అంతర పంటలు వేసుకోవచ్చని డా. శ్రీనివాసులు తెలిపారు. అన్ని రకాల కూరగాయ పంటలు, వేరుశనగ, అలసంద, పెసర, మినుము, బీన్స్ వంటి పప్పుజాతి పంటలను అంతరపంటలుగా సాగు చేసుకోవచ్చున్నారు. చింత చెట్లకు కాయతొలిచే పురుగు ఒక్కటే సమస్యగా గుర్తించారు.

మూడు నాలుగు నెలల పాటు ఉండే పిందె దశలో 1 మి.లీ క్లోరిఫైరిపాస్ లేదా 1.6 మి.లీ మోనోక్రోటోఫాస్ లేదా 2 మి.లీ డైమిథోయేట్ లేదా 1 మి.లీ డైక్లోరోవాస్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకుంటే కాయతొలిచే పురుగును నివారించుకోవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. డ్రిప్ ద్వారా నీటిని తగుమాత్రంగా అందించాలి. సేంద్రియ ఎరువులు, వేప

ఆరడుగుల మనిషి విలువ నాలుగంగుళాల నాలుకపై ఆధారపడి వుంటుంది

# పాడి పశువుల ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే అంశాలు

**పా**డి పశువుల పోషణ, నిర్వహణతోపాటు వాటి ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధవహించడం ఎంతో ముఖ్యం. పాడి పశువులు సక్రమంగా మేత మేస్తూ, ఇతర ఇబ్బందులు లేకుండా, దిగుబడి తగ్గకుండా పాలు ఇస్తున్నట్లయితే అవి ఆరోగ్యంగా ఉన్నాయని తెలుసుకోవాలి.



**అనారోగ్య సూచనలు :** పశువు మందకొడిగా ఉండడం, ముట్టె తడి ఆరిపోయి ఉండడం, కళ్లు ఎర్రబడడం లేదా పుసులు కారడం, మేత తినదు, నెమరు వేయదు, పొట్ట కదలకుండా ఉబ్బరంగా ఉండడం, శరీరం వేడిగా జ్వరంతో ఉండడం, పలుచటి పేడ వేయడం, వణకటం, దద్దుర్లు రావడం, పాల ఉత్పత్తి ఒకేసారి తగ్గించడం లేదా క్రమేమీ తగ్గించడం, మూత్రం రంగు మారడం. ఈ లక్షణాలు పాడి పశువుల్లో కనిపించినట్లయితే వీలైనంత త్వరగా పశువైద్యుణ్ణి సంప్రదించి చికిత్స చేయించాలి.

**ఇవీ సమస్యలు ...**

**వాతావరణం:** విదేశీ ఆవులు వేడి వాతావరణాన్ని తట్టుకోలేవు. అందుకే 50% సంకర జెర్సీ ఆవును లేదా సంకరజాతి హెచ్.ఎఫ్. జాతి ఆవులను ఎన్నుకోవాలి. ఎండలో మేపకుండా ఇంటివద్దనే చెట్ల నీడలలో గానీ, పాక లేదా తాటాకు షెడ్ల కింద చల్లటి వాతావరణంలో పోషించినట్లయితే మంచి పాలదిగుబడినిస్తాయి.

గేదెలు నల్ల చర్మం కలిగి ఉండటం వలన వేసవి తాపాన్ని తట్టుకోలేవు. వాటిని ఉదయం పూటనే మేతకు పంపాలి. పగటిపూట ఇంటి వద్ద చల్లటివాతావరణంలో పోషించాలి. అప్పుడే వాటి ఉత్పాదకత కోల్పోకుండా మంచి పాల దిగుబడినిస్తాయి.

**పరిసరాలు :** పాడి పశువులను పెంచే స్థలాల వద్ద పరిసరాలు శుభ్రతగా ఉండే విధంగా చూసుకోవాలి. సరైన గాలి, వెలుతురు వచ్చే విధంగా చూసుకోవాలి. మురికి నీరు నిలవకుండా చూసుకోవాలి. దాని వల్ల దోమలు, ఈగలు మొదలగు వాటిని అరికట్టి కొన్ని రకాల వ్యాధులు సోకకుండా చూసుకోవచ్చు.

**మేత, తాగునీరు :** పాడి పశువులకు మంచి పోషకాహార పదార్థాలు కలిగిన మేత సరిపోయేంత ఇవ్వాలి. పాడి పశువులకు ఇచ్చే మేత దాని శరీర అవసరానికి పోను పాల ఉత్పత్తి కోసం, ఒక వేళ సూడితో ఉన్నట్లయితే గర్భంలో పెరిగే పిండానికి అధిక పోషకాహారం అందించవలసి ఉంటుంది. అందుకే పాడి పశువులకు నాణ్యమైన మేత, దాణా సరిపోయేంత ఇవ్వాలి.

పరిశుభ్రమైన తాగునీరు ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలి. మురికినీరు, కలుషిత ప్రాంతాలలో నీరు



తాగించడం వల్ల పాడి పశువులు అనారోగ్యానికి గురవుతాయి.

రైతు ప్రతి రోజూ తన పాడి పశువులను గమనించి ఏవైనా అనారోగ్య లక్షణాలు కనిపిస్తే పశువైద్యునిచే చికిత్స చేయించాలి. అశ్రద్ధ కనపరిస్తే నష్టం అపారం కాబట్టి అప్రమత్తంగా ఉండాలి. ■

పాత స్నేహం బంగారం, కొత్త స్నేహం వజ్రం ; కాని పాత స్నేహితులను మరువరాదు, వజ్రమైనా బంగారంలోనే పొదగాలి కదా!

# ఎంత వాన కురిస్తే అంతగానే పంటలు !

**నీటి లెక్కతో రూపురేఖలు మారిన హివరె బజార్ ! ... వ్యవసాయ విప్లవాన్ని సాకారంచేసిన పోపట్‌రావ్!**

**హి**వరె బజార్!... పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ కరువును ఆమడ దూరం పారదోలిన అద్భుత ఆదర్శ గ్రామం. మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ జిల్లాలో మారుమూల సహ్యాద్రి పర్వతప్రాంతంలో ఉంది. 400 ఎం.ఎం. వర్షపాతం. కరువు కాటకాలు. కటిక పేదరికం. హింసాత్మక వాతావరణం.. వెరసి జీవితేచ్ఛ అడుగంటిపోతున్న గడ్డ



పరిస్థితుల్లో పోపట్‌రావ్ పవార్ కంకణం కట్టుకున్నాడు. సర్పంచ్‌గా బాధ్యతలు తీసుకున్న కొద్ది ఏళ్లలోనే ఆ గ్రామం రూపు రేఖలను మార్చేశారు. ఆ కొద్ది వాన నీటినీ ఒడిసిపట్టి, గ్రామీణుల్లో సమష్టి భావనను మేల్కొల్పి పర్యావరణ పరిరక్షణ ఉద్యమాన్ని నిబద్ధంగా నడిపించారు. 'వాటర్ బడ్జెటింగ్'కు పట్టం కట్టి వ్యవసాయ విప్లవం కలను సాకారం చేసింది హివరె బజార్. వాటర్ మేనేజ్‌మెంట్ ఫోరం, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్, తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘం సంయుక్త ఆహ్వానంపై ఇటీవల హైదరాబాద్ వచ్చిన గాంధేయ వాది, ప్రసిద్ధ జలయోధుడు పోపట్‌రావు పవార్‌తో 'సాక్షి సాగుబడి' ప్రతినిధి పంతంగి రాంబాబు జరిపిన ముఖాముఖిలోని ముఖ్యాంశాలను 'సాక్షి' పత్రిక సౌజన్యంతో 'మహిళా సాధికారత' పాఠకులకు అందిస్తున్నాం.

ఉన్నత విద్యావంతులై, రాష్ట్రస్థాయి క్రికెటర్‌గా పేరు గడించిన తర్వాత మారుమూల ప్రాంతంలోని మీ స్వగ్రామం హివరె బజార్‌లో స్థిరపడ్డారు. 28 ఏళ్ల నుంచి గ్రామాన్నే అంటిపెట్టుకొని ఉంటూ అద్భుత ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దారు.. *ప్రస్తుతం మీ గ్రామం ఎలా ఉంది?*

1989లో నేను మా ఊరిపై దృష్టి పెట్టే నాటికి తీవ్ర కరువు ఉండేది. పంటలు లేవు. తాగు నీటికీ కటకటగా ఉండేది. గ్రామంలో ఉపాధి లేదు. గొడవలు, హత్యల వల్ల మా గ్రామాన్ని అధికారులు బ్లాక్ లిస్ట్‌లో పెట్టారు. 95% కుటుంబాలు పొట్ట చేతపట్టుకొని పట్టణాలు, నగరాలకు వలసపోయి జీవించేవారు. మా ఊరికి ఏదైనా చెయ్యాలని ఉద్యోగానికి వెళ్లకుండా 28 ఏళ్ల క్రితం నుంచి అక్కడే ఉండిపోయాను. తొలి ఏడాదే నేను సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాను. రిజర్వేషన్ లేనప్పుడు సర్పంచ్‌గా, రిజర్వేషన్ ఉన్నప్పుడు ఉపసర్పంచ్‌గా ఉంటున్నాను. రెండేళ్లుగా ఉప సర్పంచ్‌గా ఉన్నాను. మౌలిక మార్పు తెచ్చే పనికి వాన నీటి సంరక్షణ పనులతో శ్రీకారం చుట్టాం. 40 వేల మీటర్ల పొడవున మీటరు లోతు, మీటరు వెడల్పుతో కొండల చుట్టూతూ కందకాలు తీయించాం(40 మీటర్లకు ఒక చోట 1–2 మీటర్లు వదిలేసి కందకం తీయాలి). వాననీటిని ఇంకించే 2 పర్క్యులేషన్ చెరువులు, 54 మట్టి కట్టలతో కూడిన చెరువులు, 9 సెమీ స్టోరేజ్ టాంక్‌లు నిర్మించాం. వీటన్నిటినీ గ్రామస్తులతో ఉపాధి హామీ పథకం కింద అమలుపరిచాం. ఇప్పుడు మా భూముల్లో 30–40 అడుగుల లోతులో నీరుంటుంది (చుట్టుపక్కల గ్రామాల్లో 300–400 అడుగుల లోతులోనే నీరుంటుంది).

అయినా, ఎంత వర్షపు నీరు భూగర్భంలోకి చేరిందో, అంత నీటిని మాత్రమే తిరిగి వాడుకుంటున్నాం. రబీ, వేసవి కాలపు పంటలకు లెక్కగట్టి మరీ వాడుకుంటాం. ఖరీఫ్‌లో పంటలకు నీటి తడులు ఇవ్వం. రబీ, వేసవి పంటలకు మాత్రమే డ్రిప్, స్ప్రింక్లర్లు వాడుతూ పొదుపుగా నీటిని వాడుతున్నాం. నీటిని అధికంగా తీసుకునే చెరకు, అరటి, దానిమ్మ, వరి తదితర పంటలను పూర్తిగా నిషేధించాం.



400 ఎం.ఎం. మా గ్రామం సగటు వర్షపాతం. 100 ఎం.ఎం. వర్షం పడితే మంచినీటికి కొరత ఉండదు. 400 ఎం.ఎం. పడిన సంవత్సరం రబీ, వేసవి పంటలు కూడా సాగు చేస్తాం. 300 ఎం.ఎం. వర్షం మాత్రమే కురిస్తే ఖరీఫ్, రబీలతోనే సరిపెడతాం. వేసవిలో ఏ పంటా వేయం.

**'వాటర్ బడ్జెటింగ్' అంటే..?**

అవును. 1995 నుంచి గ్రామసభలో 'వాటర్ బడ్జెటింగ్' చేసుకుంటున్నాం. వర్షం తక్కువ కురిస్తే ఆ ఏడాది తక్కువ విస్తీర్ణంలో పంటలు వేస్తాం. భూ గర్భంలోకి ఆ ఏడాది అదనంగా చేరిన నీటిని మాత్రమే బావుల ద్వారా తోడుకొని, ఆ నీటితో పండించగలిగే రకం పంటలను, తగిన విస్తీర్ణంలో మాత్రమే పండిస్తాం. ప్రతి రెండు నెలలకు గ్రామ సభ జరుగుతుంది. అందరిముందూ చర్చించి నిర్ణయం తీసుకొని అమలు చేస్తాం. బోర్లను పూర్తిగా నిషేధించాం. అందరి పొలాల్లోనూ బావులే (మొత్తం 376) ఉంటాయి. నీటి సంరక్షణ ఫలితంగా పశుగ్రాసానికి ఇబ్బంది లేకుండా పోయింది. పశుసంపద పెరిగింది. రోజుకు 5 వేల లీటర్ల పాలు అమ్ముతున్నాం. దాదాపు ప్రతి ఇంట్లో బయోగ్యాస్ ఉంటుంది. స్లర్రీని పంటలకు ఎరువుగా వాడుతున్నాం. క్రమంగా 80 శాతం రసాయనిక ఎరువుల వాడకం తగ్గించేశాం. మా భూములు సారవంతమయ్యాయి. తేమను నిలుపుకునే సామర్థ్యాన్ని పెంచుకున్నాయి. సేంద్రియ కర్బనం 1 శాతం కన్నా ఎక్కువగానే ఉంది. నీటి నాణ్యత, భూసారం, పంటల ఉత్పాదకత పెరిగింది.

**గత రెండేళ్ల పరిస్థితి ఎలా ఉంది?**

గత రెండేళ్లలో వర్షం సరిగ్గా లేదు. గత ఏడాది 168 ఎం.ఎం. కురిసింది. అంతకుముందు ఏడాదీ దాదాపు అంతే. ఖరీఫ్‌లో వర్షాధారంగా పంటలు పండించాం. పశుగ్రాసపు పంటలు తప్ప రబీ, వేసవి పంటలకు పూర్తిగా విరామం ప్రకటించాం. దాదాపు ప్రతి ఇంట్లోనూ గేదెలు, ఆవులు ఉన్నాయి. అందరికీ రోజువారీగా పాడి ఆదాయం వస్తుంది. అడవిలో పశువులు మేపడం నిషేధించాం. దసరా, దీపావళి తర్వాత గడ్డి కోసుకోవడానికి రైతులకు వీలు కల్పించాం. ఏడాదికి రూ. 100 రుసుము. బలహీనవర్గాలకు రూ. 25 మాత్రమే. చెట్లు నరకడంపై నిషేధం మొదటి నుంచీ ఉంది. మా గ్రామ పరిసరాల్లో 10 లక్షల చెట్లు నాటాం.

**పేదరికాన్ని పూర్తిగా జయించగలిగారా?**

అవును. మా గ్రామంలో 1995లో 95% కుటుంబాలు

మనిషి స్వభావం మారడం కష్టం, మార్చాలనుకోవడం అవివేకం, అంతకంటె వారితో నీవు వ్యవహరించే తీరు మార్చుకో

పేదరికంలో మగ్గేవి. ఇప్పుడు మా గ్రామంలో పేదరికంతో బాధపడేవారు ఒక్కరూ లేరు. ఉపాధి హామీ పని కావాలని అడిగే వారే లేరు. నెలకు తలసరి ఆదాయం అప్పట్లో రూ. 830 ఉండేది, ఇప్పుడు రూ. 32,000కి పెరిగింది. ఆర్థికాభి వృద్ధి కన్నా ఆనందంగా ఉండటంపైనే దృష్టి పెడుతున్నాం. మా ఊళ్లో రైతులెవరూ ఇతరులకు భూములు అమ్మకూడదని నియమం పెట్టుకున్నాం. ఊళ్లో నలుగురికి తప్ప మిగతా అందరికీ భూమి ఉంది. వారికి కూడా త్వరలో భూమి ఇప్పిస్తాం. 79% కుటుంబాల్లో కనీసం ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం ఉంది. టీచర్లు, సైనికులుగా ఎక్కువ మంది పని చేస్తున్నారు. ముగ్గురు వైద్యులు కూడా ఉన్నారు.

**మీ గ్రామంలో సాంఘిక, రాజకీయ పరిస్థితులు ఎలా ఉన్నాయి?**

రాజకీయ, కుల, మత గొడవలు లేవు. చాలా ఏళ్ల క్రితమే ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి నిర్మించుకున్నాం. దోమ ల్లేకుండా చేశాం. దోమను పట్టి చూపితే రూ.వంద బహుమతి ప్రకటించాం. మద్యపానాన్ని నిషేధించాం. హొటల్ లేదు. ఎటువంటి విగ్రహాలూ పెట్టం. సిగరెట్, తంబాకు, మాదక ద్రవ్యాలకు అనుమతి లేదు. ఎన్నికల ప్రచారానికివచ్చే నేతలు ఊరి బయటే వాహనాలు, జెండాలు వదిలి గ్రామంలోకి వచ్చి ప్రచారం చేసుకోవాలి. నినాదాలు ఇవ్వకూడదు. ఏజెంట్లను గ్రామసభే ఎంపిక చేస్తుంది. పోలింగ్ గొడవలకు తావులేదు. 90% పైగా పోలింగ్ ప్రశాంతంగా జరుగు తుంది. మా ఊళ్లో మగవాళ్ల కన్నా ఆడవాళ్లే ఎక్కువ మంది ఉన్నారు. అన్ని ఇళ్లలోనూ వంట గ్యాస్ ఉంది. వంట చెరకు కోసం, నీటి కోసం కడవలతో కిలోమీటర్లు తిరగాల్సిన బాధ తప్పటం, మద్యనిషేధం, మంచి నడవడిక నేర్పే చదువు 10వ తరగతి వరకు ఊళ్లోనే అందుబాటులోకిరావడంతో ముఖ్యంగా మహిళలు సంతోషంగా ఉన్నారు.

**నీటిని పొదుపుగా వాడుకునే పంటల సరళి గురించి చెప్పండి..?**

మార్కెట్‌ను బట్టి పంటలను ఎంపిక చేసుకొని పండించడం వల్లనే రైతులు సంక్షోభంలో కూరుకు పోతున్నారు. పర్యావరణానికి హాని కలగని రీతిలో పంటల సరళిని రూపొందించుకోవాలి. నీటి అక్షరాస్యత, పంటల సరళి అక్షరాస్యత, గ్రామ ప్రజల భాగస్వామ్యం... గ్రామాల అభివృద్ధికి చాలా కీలకం. మన భూములు ఎలాంటివి? ఆ భూములకు నీటి తేమను పట్టి ఉంచే శక్తి ఎంత మేరకు ఉంది? భూగర్భంలోకి ఎంత వాన నీటిని ఇంకింప చేసు కోవచ్చు? వర్షాకాలంలో వ్యవసాయ బావుల్లోకి నీరు ఎంత మేరకు వస్తోంది? ఈ వివరాలను అధ్యయనం చేస్తే మూడేళ్లకు ఆ గ్రామంపై పూర్తి అవగాహన వస్తుంది. ఆ తర్వాత సాగుకు నీరు ఎంత అందుబాటులో ఉండేదీ అంచనా వేసుకొని, ఆ ఏడాది ఏయే పంటలు ఎంత విస్తీర్ణంలో పండించాలన్నది నిర్ణయించుకోవాలి.

**మీ గ్రామంలో ఎలా చేశారు?**

ఉన్నది వెయ్యి హెక్టార్ల సాగు భూమి. 250 హెక్టార్లలో చింత, వేప, మామిడి, బత్తాయి వంటి తోటలు వేసి వర్షాధారంగానే సాగు చేస్తున్నాం. ఈ తోటల్లో అంతర



పంటలుగా మునగ, తదితర కూరగాయలు వేస్తుంటాం. ఖరీఫ్‌లో వర్షం బాగానే ఉంటే ఉల్లి ఎక్కువ వేస్తాం. ప్రధానంగా తీపి జొన్న, సజ్జ, టమాటా, బంతి పూలు, ఆకుకూరలు వర్షాధారంగానే సాగు చేస్తాం. రబీలో పంట లకు మాత్రమే నీటి తడులు ఇస్తాం. నీటిని పారగట్టడం అసలు లేదు. రబీలో జొన్న, బంగాళదుంప, బఠాణి, టమాట, ఆకుకూరలు వంటి పంటలు వేస్తాం. సగం నీరు వర్షం ద్వారా అందుతుంది. మిగతా సగం నీరు డ్రిప్/ స్ప్రింక్లర్ ద్వారా ఇస్తాం. ఏడాది పొడవునా ముఖ్యంగా వేసవిలో పశుగ్రాసపు పంటలు వేస్తాం, పాడి పశువులకు ఇబ్బంది లేకుండా. వేసవిలో పూల తోటలు కూడా వేస్తాం. వరుసగా రెండేళ్లు 400 ఎం.ఎం. వర్షపాతం ఉంటే పూర్తి స్థాయిలో పంటలు పండిస్తాం. అంటే.. ఖరీఫ్‌లో 100%, రబీలో డ్రిప్/స్ప్రింక్లర్ల ద్వారా 70%, వేసవిలో 30%

మంచితనం అంటే అందరినీ సంతోషపెట్టడం అనికాదు, అది అసాధ్యం ; ఎవరినీ నొప్పించకుండా వుండడమే మంచితనం

విస్తీర్ణంలో తగిన పంటలు వేస్తాం. 200 ఎం.ఎం. మాత్రమే వర్షపాతం ఉంటే ఖరీఫ్‌లో తక్కువ రోజుల్లో తక్కువ నీటితో పండే బఠాణి, ఆకుకూరలు, పశుగ్రాసం, టమాట పండిస్తాం. రబీలోనూ అంతే. నాలుగుసార్లు నీటి తడి అవసరమయ్యే ఉల్లి పంట కూడా వేయం. తీపి జొన్నకు రెండు తడులు, శనగకు ఒక తడి సరిపోతాయి. ఉల్లికి 4 తడులు అవసరమవుతాయి.

**రైతులంతా ఒప్పుకుంటున్నారా?**

గ్రామసభలోనే చర్చించి ఈ నిర్ణయాలు తీసుకుంటున్నాం. మొదటి ఐదేళ్లలో కొంత ఇబ్బంది ఉండేది. ఇప్పుడు నీటి అక్షరాస్యత పెంపొందించుకోవడంతో రైతులందరూ సంతోషంగానే ఒప్పుకుంటున్నారు. పంట విరామం కాలంలో బంధువుల ఊళ్లకు వెళ్లి సెలవులు ఎంజాయ్ చేస్తున్నారు.

**హెక్టారుకు ఎంత నికరాదాయం వస్తున్నది?**

సాధారణంగా హెక్టారుకు ఏడాదికి రూ. 30 వేల నుంచి 50 వేల వరకు రైతులకు నికరాదాయం వస్తున్నది. ఎక్కువ డబ్బు కావాలని లేదు. ఆనందంగా ఎంత వస్తే అంతే చాలు.

**మీ కుటుంబం గురించి..?**

మాది ఉమ్మడి కుటుంబం. ముగ్గురు అన్నదమ్ములం, ముగ్గురు అక్కచెల్లెళ్లు. ఉమ్మడి భూమి 25 ఎకరాలు. 28 ఏళ్ల నాడూ అంతే, ఇప్పుడూ అంతే. 10 ఎకరాల్లో సీతాఫలం తోట వేశాం. మిగతా 15 ఎకరాల్లో ఉల్లి, తీపి జొన్న, టమాట, బంతి పూలు తదితర పంటలు పండిస్తున్నాం. ఎం.కాం. చదివాను. క్రికెటర్‌గా రాష్ట్ర స్థాయిలో పేరు సంపాదించాను. అయినా, ఉద్యోగం చూసుకోవడం కన్నా ఊరికోసం పనిచేయడం మంచిదని ఊళ్లోనే ఉంటున్నాను. నా కుమార్తెకు పెళ్లి చేశాను. కుమారుడు ఈ మధ్యనే అగ్రి బిఎస్సీ పూర్తి చేశాడు. ఊళ్లోనే ఉండి వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్ చేయాలని అనుకుంటున్నాడు.

**ప్రపంచవ్యాప్తంగా నీటి నిపుణుల దృష్టిని మీ గ్రామం ఆకర్షించింది కదా..?**

1995 నుంచి గ్రామస్థాయిలో పంచవర్ష ప్రణాళికలు



తయారు చేసుకొని అమలు చేస్తున్నాం. ఉపాధి హామీ, ఆదర్శ గ్రామ పథకం ద్వారా నిధులతో, గ్రామస్తుల శ్రమదానంతోనే అన్ని పనులూ చేసుకున్నాం. అదనపు నిధులు గానీ, విదేశీ నిధులు గానీ, కార్పొరేట్ నిధులు గానీ పైసా కూడా తీసుకోవట్లేదు. గ్రామానికి చెందిన వారి విరాళాలను మాత్రమే తీసుకుంటున్నాం. మా గ్రామాన్ని రోజూ 500 మంది సందర్శిస్తూ ఉంటారు. 60 దేశాల నీటి నిపుణులు సందర్శించారు. అనేక ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాలు మా అభివృద్ధి నమూనాను అధ్యయనం చేస్తున్నాయి.

**రాజకీయ, కుల, మత ప్రాతిపదికపై చీలిపోయి ఉన్న గ్రామాల్లో మీ అభివృద్ధి నమూనాను అమలు చేయడం సాధ్యమేనా?**


ముమ్మాటికీ సాధ్యమే. మొదట ఒక వ్యక్తి లేదా కుటుంబం గ్రామంలోనే ఉండి దృఢ దీక్షతో పని చేయాలి. నాలుగైదేళ్ల తర్వాత ఫలితాలు రావడం చూసి ప్రజలు మద్దతు ఇవ్వడం ప్రారంభిస్తారు. ఎటొచ్చీ నాయకత్వం వహించే వ్యక్తి రాజకీయాలకు అతీతంగా నిలబడాలి. అంతే. నాకు అసెంబ్లీ, పార్లమెంటు టిక్కెట్లు ఇస్తామని అనేక పార్టీలు ఆఫర్ ఇచ్చినా నేను తిరస్కరించి, గ్రామం కోసమే నిలబడ్డాను. రాజధానిలో ప్రణాళికలు రచించి ఒక శాఖ లేదా సంస్థ ద్వారా వాటిని అమలుపరిస్తే ఇక గ్రామీణ సమాజానికి భాగస్వామ్యం ఎక్కడ దొరుకుతుంది? ప్రపంచం ఇవ్వాళ ఎదుర్కొంటున్న సమస్యలను మేం 25 ఏళ్ల క్రితమే పరిష్కరించగలిగాం. గ్రామ ప్రజలను భాగస్వాముల్ని చేయగలిగాం కాబట్టే ఇది సాధ్యపడింది. గ్రామాలు, ప్రభుత్వం కలిసి అభివృద్ధి కోసం పాటుపడాలి. అయితే, ఈ ప్రయాణంలో గ్రామాలే డ్రైవర్ సీటులో ఉండాలి! ■

ఆశ లేని చోట ఆందోళనే లేదు, అంతా ప్రశాంతమే !

# మీ కిడ్నీలు సరిగ్గా పని చేస్తున్నాయా ?

మన శరీరంలో ఎప్పటికప్పుడు పేరుకుపోయే వ్యర్థాలను బయటకు పంపడంలో కిడ్నీలు ముఖ్య పాత్ర పోషిస్తాయన్న సంగతి తెలిసిందే. కిడ్నీలు వ్యర్థాలను వడబోసి మూత్రం ద్వారా బయటకు పంపుతాయి. అయితే కిడ్నీలు ఆరోగ్యంగా ఉన్నంత కాలం మనకు ఎలాంటి సమస్యలూ రావు. కానీ కిడ్నీలు పాడైతే మాత్రం మనకు అనేక అనారోగ్య లక్షణాలు కనిపిస్తాయి. అవేమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

- మూత్రం ఎప్పుడూ రంగు మారి వస్తుంటే కిడ్నీల సమస్య ఉన్నట్లు గుర్తించాలి. సాధారణ రంగులో కాకుండా మూత్రం రంగు మారి వస్తుంటే కిడ్నీ చెకప్ చేయించుకోవాలి. వైద్యుల సలహా మేరకు చికిత్స తీసుకోవాలి.
- కిడ్నీలు సరిగ్గా పని చేయకపోతే వ్యర్థాలు రక్తంలోనే ఉంటాయి. దీంతో నోట్లో దుర్వాసన వస్తుంది. అలాగే ఆకలి కూడా బాగా తగ్గుతుంది.
- తరచూ వికారం, వాంతుల సమస్య ఉన్నా కిడ్నీ సమస్యేమోనని అనుమానించాలి. వైద్య పరీక్షలు చేయించుకుని సమస్య ఉంటే డాక్టర్ సూచన మేరకు మందులను వాడడమో, శస్త్ర చికిత్స చేయించు కోవడమో చేయాలి.
- కిడ్నీలు సరిగ్గా పని చేయకపోతే శరీరంలో వ్యర్థ ద్రవాలు అలాగే ఉంటాయి. దీంతో ఆ ద్రవం పలు భాగాల్లోకి చేరి శరీరం ఉబ్బినట్లు కనిపిస్తుంది. ముఖ్యంగా కిడ్నీలు పాడైతే కాళ్లు, చేతులు బాగా వాపునకు లోనవుతాయి. అవి ఉబ్బిపోయి కనిపిస్తాయి. ఈ సమస్య ఉన్నా వెంటనే పరీక్షలు చేయించుకోవడం మంచిది.
- కిడ్నీలు సరిగ్గా పని చేయకపోతే ఆ ప్రభావం వల్ల శరీరంలో ఉన్న ఎర్ర రక్తకణాల సంఖ్య తగ్గి రక్తహీనత వస్తుంది. దీంతో తీవ్రమైన అలసట ఉంటుంది. ఈ సమస్య ఉన్నా స్పందించి వైద్య పరీక్షలు చేయించుకోవాలి.
- కిడ్నీలు సరిగ్గా పని చేయకపోతే చర్మంపై దద్దుర్లు కూడా వస్తుంటాయి. అలాగే కిడ్నీలు ఉండే వీపు ప్రాంతంలో పొడిచినట్లు నొప్పి వస్తుంది.



- కిడ్నీ సమస్య ఉంటే శ్వాస తీసుకునే ప్రక్రియలో ఇబ్బందులు ఏర్పడుతాయి. జ్ఞాపకశక్తి తగ్గుతుంది. ఏకాగ్రత ఉండదు. వాతావరణం ఎలా ఉన్నా సరే చల్లని ఫీలింగ్ కలుగుతుంది. ఈ లక్షణాలు గనక ఎవరిలోనైనా ఉంటే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే స్పందించి డాక్టర్‌ను కలిసి పరీక్షలు చేయించుకుని అందుకు అనుగుణంగా చికిత్స తీసుకుంటే కిడ్నీలు మరింత పాడవకుండా ముందుగానే జాగ్రత్త పడవచ్చు. లేదంటే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారేందుకు అవకాశం ఉంటుంది. ■

సత్యం బాధాకరమైన చికిత్స లాంటిది, కాని అస్వస్థత పోతుంది, అసత్యం తక్షణ ఉపశమన ఔషధం, కాని దుష్ఫలితాలు ఎన్నో !

# డెంగీ దోమతో జాగ్రత్త సుమా !



**దో**మలు కుట్టడం వల్ల మనకు వచ్చే విష జ్వరాల్లో డెంగీ కూడా ఒకటి. ఇది ఏడిస్ రకానికి చెందిన దోమలు కుట్టడం వల్ల వస్తుంది. అయితే ఈ దోమలు ఎక్కువగా ఉదయం, సాయంత్రం వేళల్లోనే మనల్ని కుడతాయి. ఈ దోమలు కుట్టగానే మన శరీరంలో డెంగీ వైరస్ వ్యాప్తి చెందుతుంది. ఫలితంగా మనకు అనేక అనారోగ్య లక్షణాలు కనిపిస్తాయి.

డెంగీ వచ్చిన వారికి విపరీతమైన జ్వరం ఉంటుంది. చలిగా అనిపిస్తుంది. తీవ్రమైన ఒళ్లు నొప్పులు, తలనొప్పి ఉంటాయి. శరీరంపై ఎరుపు రంగులో దద్దుర్లు వస్తాయి. దాహం విపరీతంగా అవుతుంది. నోరు ఎక్కువగా తడారిపోతుంది. వాంతులు అవుతుంటాయి. కళ్లు నొప్పిగా అనిపిస్తాయి. అయితే డెంగీ వచ్చినప్పటికీ కొందరికి వీటిలో ఒక్కోసారి ఏ ఒక్క లక్షణమూ కనిపించకపోవచ్చు. అలాంటి వారికి వ్యాధి వచ్చాక



2 లేదా 3 రోజుల తరువాత ఈ లక్షణాలు కనిపించే అవకాశం ఉంటుంది.

జ్వరం బాగా వచ్చిన వారు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. డాక్టర్ రోగికి ఉన్న లక్షణాలకు అనుగుణంగా డెంగీ టెస్టు చేస్తారు. అందులో పాజిటివ్ వస్తే వైద్యులు రోగిని హాస్పిటల్‌లో చేర్చుకుని చికిత్స ప్రారంభిస్తారు. అయితే చికిత్స సమయంలో రోగులు చాలా జాగ్రత్తగా ఉండాలి. మందులు టైముకు వేసుకోవాలి. ఇక మిగిలిన కుటుంబ సభ్యులు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. ముఖ్యంగా దోమలు లేకుండా చూసుకోవాలి.

**డెంగీ వచ్చిన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు...**

- వైద్య పరీక్షల్లో డెంగీ ఉందని తేలితే ఏమాత్రం నిర్లక్ష్యం చేయరాదు. వెంటనే చికిత్స తీసుకోవాలి. రోగి శరీరాన్ని చల్లని గుడ్డతో తుడుస్తుండాలి. జ్వరం వచ్చిన వారిని చల్లని ప్రదేశంలో పడుకోబెట్టాలి.
- డెంగీ రావడం వల్ల ప్లేట్‌లెట్ల సంఖ్య బాగా తగ్గుతుందనే విషయం తెలిసిందే. అలాంటప్పుడు వైద్యులు ప్లేట్లను పెంచేందుకు మందులు ఇస్తారు. వాటితో పాటు బొప్పాయి ఆకుల రసాన్ని చాలా స్వల్ప మోతాదులో సేవిస్తుండాలి. దీంతో ప్లేట్‌లెట్ల సంఖ్యను పెంచుకోవచ్చు.
- డెంగీ వచ్చిన వారు రోగనిరోధక శక్తిని పెంచే పండ్లు, ఇతర ఆహారాలను ఎక్కువగా తీసుకుంటే వ్యాధి నుంచి త్వరగా బయట పడేందుకు అవకాశం ఉంటుంది.
- తాజా పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, ద్రాక్ష, కివీలు, దానిమ్మ, నారింజ పండ్లను బాగా తీసుకుంటే డెంగీ నుంచి త్వరగా కోలుకోవచ్చు.

■

తమ సమస్యలను నీతో పంచుకునే వారిని చిన్నచూపు చూడకు : నీకు చెప్పడం వారు అసమర్థులై కాదు, నీమీద నమ్మకంతో

# గుంతలు తవ్వే యంత్రం ... మొక్కలు నాటే యంత్రం !

**త**క్కువ శ్రమ, తక్కువ ఖర్చుతో పండ్ల తోటలు, కలప తోటలు నాటుకునేందుకు ఉపయోగపడే ఓ డ్రిల్లింగ్ యంత్రాన్ని రూపొందించాడు ఓ రైతు. ఆయన పేరు సయ్యద్ అహమీద్ బాషా. ఊరు మండ్లెం. జూపాడు బంగ్లా మండలం. కర్నూలు జిల్లా. బాషా తనకున్న ఏడెకరాల పొలంలో మలబార్ వేప మొక్కలు నాటాలని సంకల్పించారు.





కూలీలతో గుంతలు తీయటం ప్రారంభించారు. ఒక్కో కూలీకి రూ.500ల చొప్పున చెల్లిస్తే రోజుకు 5 గుంతలకు మించి తీయలేకపోయారు. 7 ఎకరాల పొలంలో 4 వేల మొక్కలు నాటాలంటే కూలి ఖర్చులే తడిసి మోపెడవుతాయని భావించిన హమీద్ బాషా ఇందుకు ఒక సులువైన ఉపాయం ఆలోచించారు.

వివిధ యంత్రాలకు చెందిన పాత సామాన్లను సేకరించి, తన పాత బైక్‌కు అమర్చి విజయవంతంగా ఒక డ్రిల్లింగ్ యంత్రాన్ని రూపొందించారు. అడుగు వెడల్పు, రెండున్నర అడుగుల లోతుతో గుంతలు తవ్వేలా డ్రిల్లింగ్ యంత్రాన్ని తయారు చేయించారు. దీనికి రూ.1.10 లక్షలు ఖర్చుచేశారు. దీని సహాయంతో స్వయంగా తానే గుంతలు తీసి మలబార్ వేప మొక్కలు నాటించారు. దీన్ని బైక్ లాగానే నడుపుకుంటూ పొలానికి తీసుకెళ్లవచ్చు. అక్కడికి వెళ్లాక అప్పటికప్పుడు కొన్ని మార్పులు చేస్తే డ్రిల్లింగ్ యంత్రంగా మారిపోతుంది. లీటరు పెట్రోలు పోస్తే 300 వరకు గుంతలు తవ్వవచ్చంటున్నారు. ఈ యంత్రం వల్ల తనకు డబ్బు ఆదా అయ్యిందని రైతు శాస్త్రవేత్త సయ్యద్ హమీద్ బాష (90596 79595) గర్వంగా చెప్పారు.

**మొక్కలు నాటడం ఎంతో సులువు !**

వర్జీనియా పొగాకు సాగు అధిక పెట్టుబడితో కూడిన వ్యవహారం. కూలీలతో మొక్కేత వేయిస్తే ఎకరానికి ఎనిమిది మంది వరకు కూలీలు అవసరం. అచ్చు, సాలు, ఇరువాలు, కాలువలు తీయించడం. అన్నిటికీ కలిపి ఎకరానికి రూ.5 వేల నుంచి రూ. 6 వేల వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తున్నది. ఈ నేపథ్యంలో ఐటీసీ, మహీంద్రా కంపెనీలు పొగ మొక్కలు నాటే యంత్రాన్ని రైతులకు అందుబాటులోకి తెచ్చాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం ఊట్లపల్లి సమీపంలోగల తిమ్మాపురం వద్ద ఉన్న కొడవాటి వాసు రైతు పొలంలో ఇటీవల మొక్కలు నాటి, ఈ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ యంత్రం ద్వారా ట్రే పద్ధతిలో పెంచిన పొగాకు మొక్కలను రోజుకు 5



ఎకరాల్లో నాట్లు వేసుకోవచ్చు.

ఈ యంత్రం ద్వారా మొక్క నాటడం, మొక్క మొదలు దగ్గరకు మట్టిని ఎగదోసి వత్తడంతో పాటు ప్రతి మొక్కకు 300 మిల్లీ లీటర్ల నీటిని అప్పటికప్పుడే పోయవచ్చు. ఈ యంత్రాన్ని నడిపేందుకు ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు నలుగురు కూలీలు ఉంటే చాలు. గంటకు 1,500 మొక్కల చొప్పున రోజుకు ఐదెకరాల్లో మొక్కలు నాటుకోవచ్చు. కూలీల ఖర్చు, సమయాలతోపాటు సాగు నీటిని కూడా ఆదా చేసుకోవచ్చు. ■

నమ్మితే మౌనం కూడా చక్కగా అర్థమవుతుంది, నమ్మకం లేకుంటే ప్రతి మాట అపార్థంగానే వినిపిస్తుంది

# డిడిఎస్ మహిళా రైతులకు ఈక్వేటర్ అవార్డు !



**మూ**దున్నర దశాబ్దాలుగా పర్యావరణ పరిరక్షణ, చిరుధాన్యాల సాగు, సేంద్రియ సేద్యం రంగాల్లో విశేషంగా కృషి చేస్తున్న జహీరాబాద్‌కు చెందిన దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీకి చెందిన ముగ్గురు మహిళా రైతులు అంతర్జాతీయ పురస్కారం అందుకున్నారు. ఐక్యరాజ్యసమితికి అనుబంధ సంస్థగా ఉన్న యూఎన్‌డీపీ ఆధ్వర్యంలో రెండేళ్లకోసారి పలు సంస్థల సేవలను గుర్తించి ఈక్వేటర్ అవార్డుతో సత్కరిస్తారు. 2019 సంవత్సరానికి సంబంధించి డిడిఎస్‌కు ఈ పురస్కారం లభించింది. సెప్టెంబరు 24న న్యూయార్క్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈక్వేటర్ అవార్డుతో పాటు (10వేల డాలర్లు) రూ.7.50 లక్షల నగదును నలుగురు డిడిఎస్ మహిళా ప్రతినిధులు అందుకున్నారు.

జీవ వైవిధ్యంపై డాక్యుమెంటరీలు రూపొందించి దేశ, విదేశాల్లో అవార్డులు అందుకున్న పస్తాపూర్ గ్రామానికి చెందిన 18 ఏళ్ల మయూరి, చిరుధాన్యాల సాగులో ఉత్సాహం చూపుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న చిరుధాన్యాల చెల్లెళ్ల సమాఖ్య అధ్యక్షురాలు పొట్టిపల్లి మొగులమ్మ, భవిష్యత్ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని 25 ఏళ్ల క్రితమే పర్యావరణ పరిరక్షణలో చెట్లను పెంచడానికి కృషి చేసిన పస్తాపూర్‌కు చెందిన అనుసూయమ్మలతో పాటు డిడిఎస్ డిప్యూటీ జాయింట్ డైరెక్టర్ జయశ్రీ చెరుకూరి అమెరికాలోని న్యూయార్క్‌కు వెళ్లి అవార్డును, నగదు పురస్కారాన్ని స్వీకరించారు.

డిడిఎస్ ఆధ్వర్యంలో మహిళా సంఘాలు ఏర్పాటుచేసి వారిలో చైతన్యం తీసుకొస్తున్నామని, సేంద్రియ సాగుపై అవగాహన కల్పిస్తున్నామన్నారు డిడిఎస్ డైరెక్టర్ పి.వి. సతీష్. న్యూయార్కులో నిర్వహించిన ఈక్వేటరీ అవార్డును అందుకోవడానికి డిడిఎస్ నుంచి మూడు తరాల మహిళలను ఎంపిక చేశామన్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన మహిళా రైతులకు ఈక్వేటర్ అవార్డు రావడం గర్వకారణం అని ఆయన అన్నారు. **(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో ...)**

## పశు సంపదలో ఏపీ ఏడో స్థానం, తెలంగాణా ఎనిమిదవ స్థానం !

**ప**శు సంపదలో ఆంధ్రప్రదేశ్ దేశంలో ఏడో స్థానంలో నిలిచింది. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బీహార్, మహారాష్ట్ర తొలి ఆరుస్థానాల్లో నిలిచాయి. ఇక... తెలంగాణ రాష్ట్రం 8వ స్థానంలో ఉంది. తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గొర్రెల పంపిణీ పథకం ప్రభావం సుస్పష్టంగా కనిపించింది. 2012తో పోలిస్తే రికార్డు స్థాయిలో 48.74 శాతం గొర్రెల సంఖ్య పెరిగింది. మేకలు, గేదెల సంఖ్యలో కాస్త పెరుగుదల కనిపించింది. అయితే ఆవులు, ఎడ్ల సంఖ్య 13.20% తగ్గిపోవడం ఆందోళనకరం. కేంద్రం తాజా గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 22% పశు సంపద పెరిగింది. ఈ ఏడాది జులైలో పశుగణన పూర్తయింది. తెలంగాణలో 2012 లెక్కల ప్రకారం 2.67 కోట్ల పశు సంపద ఉండగా... ప్రస్తుతం 3.26 కోట్లకు చేరింది. అంటే గత ఏడేళ్ళలో 22 శాతం పెరిగింది. 7.29 లక్షల యూనిట్లు (ఒక్కో యూనిట్‌కు 20 గొర్రెలు, ఒక పొట్టేలు పంపిణీ ప్రభుత్వం లక్ష్యం కాగా... 3.70 లక్షల యూనిట్లు పంపిణీ చేసింది.

నీ శక్తి సామర్థ్యాలను అనుమానిస్తే బాధపడకూడదు, ఎందుకంటె బంగారం నాణ్యతను శంకిస్తారు కాని ఇనుమును కాదుగా!

# పీతల సాగులో నలుగురు యువకుల నవ్యపథం !

కొత్తగా ఆలోచించి, ఆ ఆలోచనను పట్టుదలతో అమలు చేస్తే విజయం సొంతం అవుతుందని నిరూపించారు కృష్ణాజిల్లా దివిసీమ ప్రాంతానికి చెందిన యువకులు. సంప్రదాయ పద్ధతికి భిన్నంగా సాఫ్ట్ షెల్ పీతలను సాగు చేసి, విదేశాలకు ఎగుమతి చేస్తూ మంచి లాభాలు గడిస్తున్నారు.

ప్రకాశం జిల్లాకు చెందిన సురేష్ సాఫ్ట్ వేర్ ఉద్యోగాన్ని వదిలేసి కృష్ణా జిల్లా నాగాయలంక మండలం పెదపాలెంలో పీతల సాగు చేపట్టారు. అలాగే విజయవాడకు చెందిన వి.వి.రాజు విజయవాడలో తన వ్యాపారాన్ని కొనసాగిస్తూనే



సంప్రదాయ విధానానికి భిన్నంగా సాఫ్ట్ షెల్ విధానంలో పీతల సాగు చేస్తున్నారు. వీరికి చిన్నతరహా పరిశ్రమతో ఉపాధి పొందుతున్న కంచర్ల కుమారస్వామి, పెదపాలెం గ్రామానికి చెందిన సుధీర్ వర్మ జతకలిశారు. వీరంతా బృందంగా ఏర్పడి దాదాపు 30 వేల బాక్సుల్లో పీతల సాగును చేపట్టారు. గుల్లలేని పీతకు (సాఫ్ట్ షెల్ పీత) అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ ఉందని అంతర్జాలం ద్వారా తెలుసుకున్నారు. ఆ పీతను ఎలా సాగు చేయాలో అధ్యయనం చేశారు. ఆక్వా సాగులో ఉన్న సీనియర్ రైతుల నుంచి సాగు పద్ధతులు తెలుసుకున్నారు. అలానే పీత జీవనచక్రం అధ్యయనం చేసి ఎవరికి వారు వేరువేరుగా సాగు చేపట్టారు.

అయితే మార్కెట్లో ఉన్న డిమాండుకు సరిపడినంత సరుకు వీరి వద్ద లేకపోవటంతో దళారులు తరచూ తక్కువ ధరకు అడుగుతున్నారని గ్రహించారు. దీనిని అధిగమించేందుకు ఎక్కడెక్కడ ఎవరెవరు సాఫ్ట్ షెల్ పీత సాగు చేస్తున్నారు అనే వివరాలు సేకరించి ఒక వాట్సప్ గ్రూప్‌గా ఏర్పడి పరస్పరం అభిప్రాయాలు పంచుకుంటూ సాగులో ముందడుగు వేస్తున్నారు. విడివిడిగా సాగుచేస్తే లాభం లేదని గ్రహించిన ఈ యువ బృందం ఉమ్మడిగా సాఫ్ట్ షెల్ సాగు చేపట్టారు. ఈ యువ రైతులకు వరంగల్లులో ప్లాస్టిక్ మౌల్డ్ వ్యాపారంలో ఉన్న కంచర్ల కుమారస్వామి బాక్సులను సరఫరా చేస్తున్నారు. ఉమ్మడి సాగు వల్ల ఎగుమతులకు అవసరమైన మొత్తంలో పీతలను ఉత్పత్తి చేయగలుగుతున్నారు. నాణ్యమైన పీతలను పెంచడంతో అంతర్జాతీయ మార్కెట్లో మంచి ధర పొందుతూ లాభాల బాటలో పయనిస్తున్నారు ఈ రైతులు. ఉప్పునీటి చెరువుల్లో బాక్సులను ఒక క్రమపద్ధతిలో ఏర్పాటు చేసి అందులో మత్స్యకారుల నుంచి కొనుగోలు చేసిన బాడి పీతలను వేసి నెలరోజుల పాటు వాటికి కావలసిన ఆహారాన్ని అందిస్తారు. అవి గుల్లకట్టిన వెంటనే వాటిని శక్తివంతమైన డీప్ ఫ్రీజర్లో భద్రపరుస్తారు. ఈ క్రమంలో ప్రతి బాక్సుకు మేత వేసేందుకు అనువుగా చెరువు మధ్యగా చెక్క వంతెన కట్టి చెరువు పరిమాణాన్ని బట్టి బాక్సులను తేలేలా, వెనక్కు, ముందుక్కు జరుపుకొనేలా ఏర్పాటుచేస్తారు. వాటికి మేత వేసి గుల్లకట్టిన పీత ఉంటే దానిని వెంటనే బయటకు తీసి అతి శీతలమైన నీటిలో వేసి చనిపోయేలా చేసి అనంతరం పేపర్లో చుట్టి డీప్ ఫ్రీజర్లో భద్రపరుస్తారు. గుల్లకట్టిన పీతను కొద్ది గంటలు గమనించకుండా ఉంటే ఆ పీత గట్టిపడిపోవటం ప్రారంభమై మరో 28 రోజుల పాటు దానిని పోషించాల్సి ఉంటుంది. సంప్రదాయ సాగువిధానంలో వున్న ఈ సమస్యను అధిగమించేందుకు సాఫ్ట్ షెల్ సాగును ఆశ్రయించారు ఈ యువరైతులు. సాఫ్ట్ షెల్ సాగుచేసే రైతులు స్థానిక మత్స్యకారుల నుంచి, మార్కెట్ల నుంచి కొనుగోలు చేసిన పీతలను బాక్సుల్లో పెట్టి ఆహారం అందిస్తారు. కొనుగోలుచేసే నాటికి కొద్ది రోజుల ముందు గుల్లకట్టిన పీత అయితే 15 నుంచి 28 రోజుల్లోపు బాక్సులో గుల్లకడుతుందని రైతులు చెబుతున్నారు.

గుల్లకట్టిన పీతలను శక్తివంతమైన డీప్ ఫ్రీజర్లలో ఉంచి దేశీయంగా ఉన్న మార్కెట్లకు, సింగపూర్, జపాన్ వంటి

దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ప్రస్తుతం 30 వేల

అనుబంధాలు మానసిక స్థితితోనో, నియమనిబంధనలతోనో ఏర్పడవు ; పరస్పర ప్రేమానురాగాలే వాటికి మూలం

# కొద్ది భూమిలో తక్కువ ఖర్చుతో చేపల పెంపకం !

**చే**పలు పెంచాలంటే ఎకరాల కొద్దీ భూమి అవసరం లేదు. భారీ ఎత్తున నీరు అంతకంటే అవసరం లేదు. ఉన్న కొద్దిపాటి భూమినే సద్వినియోగం చేసుకుని తక్కువ ఖర్చుతో అధునాతన పద్ధతిలో చేపల పెంపకం చేపట్టి వినూత్న ఒరవడికి శ్రీకారం చుట్టారు జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన అరుణ్ క్రాంతి. ఆయన చదువుకున్నది బీటెక్ అయినప్పటికీ చేపల పెంపకంపై ఉన్న ఆసక్తితో ఆర్ఏఎస్ (రీసర్కులేటింగ్ ఆక్వా కల్చర్ సిస్టమ్) పద్ధతిలో చేపలు పెంచుతున్నారు. కేరళ రాష్ట్రంలోని కొచ్చిన్‌లో ఆరు మాసాల పాటు శిక్షణ తీసుకున్నారు. అలాగే ముంబాయి, ఢిల్లీకి వెళ్లి ఆ ప్రాంతంలో చేపల ఉత్పత్తి తీరును కూడా పరిశీలించారు. శిక్షణలో పొందిన పరిజ్ఞానానికి, సొంత అనుభవం జోడించి కేవలం 180 గజాల స్థలంలోనే చేపల పెంపకానికి శ్రీకారం చుట్టారు. 30 అడుగుల పొడవు, 30 అడుగుల వెడల్పు, 12 అడుగుల లోతుతో గుంతను తవ్వారు. అందులో రీసర్క్యులేటింగ్ ఆక్వా కల్చర్ విధానంలో చేపల పెంపకానికి శ్రీకారం చుట్టారు.

చేపల పెంపకం కోసం తవ్విన గుంతలో హెచ్‌డీపీఈ (హైడెన్సిటీ పాలిథీన్) కవర్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో నీటిని నింపి 7 రకాల ఫిల్టర్‌లను అమర్చి 8 మోటార్లను ఏర్పాటు చేశారు. ఇందుకు ఆయన రూ.3 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. చేపలు పెంచే నీటి తొట్టిలో ఘన, ద్రవ పదార్థాలను వేరు చేసేందుకు కూడా డ్రమ్ ఫిల్టర్‌లను, బయో ఫిల్టర్‌లను ఏర్పాటు చేశారు. రెడీమేడ్‌గా నీటిలో తేలియాడే దాణా ఆహారంగా అందిస్తున్నారు. తక్కువ స్థలంలో ఎక్కువ చేపలను పెంచాల్సి వస్తుండటంతో రెండు ఆక్సిజన్ బ్లోయర్‌లను ఏర్పాటు చేశారు.



కొద్దిపాటి స్థలంలో అతి తక్కువ నీటి వినియోగంతో, అత్యధిక సాంద్రతతో చేపలు పెంచడానికి ఆర్ఏఎస్ విధానం అనుకూలమైందని ఆయన చెబుతున్నారు.

**బతికిన చేపల విక్రయం.. అధికలాభం**

ఆర్ఏఎస్ విధానం కొన్ని ముఖ్య నగరాల్లో అందు బాటులో ఉన్నా తిల, ప్రియ, ఫంగ్‌సలాంటి చేపలనే ఉత్పత్తి చేస్తుంటారు. కానీ అరుణ్ క్రాంతి బంగారు తీగలాంటి బాగా ఖరీదైన చేపలతో పాటు అపోలో ఫిష్, రూప్‌చంద్, పాప్‌డా, చీతల్, మంగూర్, సింగీ, కొరమీనులాంటి చేపలను పెంచడం విశేషం. తక్కువ పెట్టుబడి పెట్టి, ఎక్కువ చేపలు ఉత్పత్తి చేసి బతికివున్న చేపలనే విక్రయిస్తుండటంతో అరుణ్ క్రాంతి చేపలకు ఈ ప్రాంతంలో మంచి డిమాండ్ ఏర్పడింది.

మొదటి ఏడాది మూడున్నర టన్నుల చేపలను ఉత్పత్తి చేసిన ఆయన, రెండవ ఏడాది 4.8 టన్నులు, మూడవ ఏడాది రికార్డు స్థాయిలో 6.2 టన్నుల చేపలను ఉత్పత్తి చేశారు. ఒక్కో కిలో చేప పెంచేందుకు ఆయన రూ.65 ఖర్చు పెడుతుండగా, బతికి ఉన్న చేపను ఆయన కిలోకు రూ.130కి విక్రయిస్తున్నారు. ఇప్పుడు తెలంగాణలోనే అరుణ్ క్రాంతి ఏర్పాటుచేసిన జగిత్యాల ప్రాజెక్ట్ పైలెట్ ప్రాజెక్ట్‌గా గుర్తింపు పొందింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కాకుండా ముంబాయి, బెంగుళూరు, కేరళకు చెందినవారు కూడా ఇక్కడకు వచ్చి ఈ ప్రాజెక్ట్‌ను తిలకిస్తున్నారు. ఇదిలావుంటే జగిత్యాలలో అరుణ్ క్రాంతి చేపట్టిన చేపల పెంపకం విధానం రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందింది.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

■

---

బాక్సుల్లో సాగు జరుగుతూ ఉండగా ప్రతినెలా తక్కువలో తక్కువ టన్నుకు పైగా పీతలను విదేశాలకు ఎగుమతి చేస్తున్నామని, మరో టన్ను పీతలను దేశీయ మార్కెట్లకు సరఫరా చేస్తున్నామని ఈ రైతులు చెబుతున్నారు. స్థానిక మత్స్యకారుల నుంచి 80 నుంచి 110 గ్రాముల పీతలను కేజీ ఒక్కింటికి రూ. 100 వెచ్చించి కొనుగోలు చేస్తున్న రైతులు గుల్లకట్టిన అనంతరం వాటిని దేశీయంగా ఉన్న మార్కెట్లకు, విదేశాలకు కేజీ ఒక్కింటికి రూ. 800 వంతున అమ్ముతూ లాభాలు పండిస్తున్నారు. ■

నిజాయితీ బాటలో నడవడంలో గొప్ప సౌకర్యం వుంది, ఆ దారిలో రద్దీ బాగా తక్కువ

# పత్తి పంటను పట్టి పీడిస్తున్న 'గులాబీ' !

## పూతనే ఆశించిన పురుగు ... ఉధృతమైతే దిగుబడిపై ప్రభావం

**పింక్** వార్మ్ (గులాబీ) పత్తి పంటకు పెనుముప్పుగా మారింది. పూత దశలోనే ఈ పురుగు అక్కడక్కడా కనిపించడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సత్వర సస్య రక్షణ చర్యలు చేపడితే గులాబీ పురుగును అరికట్టవచ్చంటున్నారు శాస్త్రవేత్తలు.



గులాబీ రంగు పురుగు(పింక్ బోల్ వార్మ్) పేరు చెబితేనే పత్తి రైతులు బెంబేలెత్తుతున్నారు. మూడేళ్లుగా రాష్ట్రంలో పత్తి పంటను కబళిస్తున్న ఈ పురుగును సమూలంగా నిర్మూలించే చర్యలు ప్రభుత్వం చేపట్టకపోవడంతో ఈ ఏడాదీ అదే భయం రైతులను వెంటాడుతోంది. ప్రస్తుతం ఇది అక్కడక్కడా కన్పిస్తోంది. పత్తి సాగు ఆశాజనకంగా ఉన్న తరుణంలో ఇప్పటికే అనేకచోట్ల రసం పీల్చే పురుగు, తెల్ల దోమ, శనగపచ్చ పురుగు కనిపిస్తుండగా, కాపు దశలో గులాబీ పురుగు కూడా ఉధృతమైతే పంట పూర్తిగా నాశనమవుతుందని భయపడుతున్నారు రైతులు.

గత ఏడాది పత్తి కాయ దశలోనే ఆశించిన ఈ పురుగు పంటను పాడు చేయడంతో దిగుబడి ఎకరానికి ఐదారు క్వింటాళ్లు తగ్గింది. ఈసారి పూత దశలోనే పురుగు చేలల్లోకి వచ్చేసింది. దీనిని గుర్తించేందుకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయడంతో పాటు పురుగు ఆనవాలు కన్పించగానే తగిన సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

**లింగాకర్షక బుట్టలతో చెక్**

పత్తి పైరులో గులాబీ రంగు పురుగును గుర్తించేందుకు ఎకరానికి 8 లింగాకర్షక బుట్టలు అమర్చి, మూడు రోజుల్లో తల్లి రెక్కల పురుగు కన్పిస్తే వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. పురుగు కన్పించిన వెంటనే 5 శాతం వేపగింజల కషాయం పిచికారీ చేయాలి. ఒకసారి లార్వా కనిపిస్తే ఇక పురుగు ఆశించడం ఖాయం. గడ్డిపూలు, రాలిన పూత, పిందెలను పంటకాలంలో గుర్తిస్తే వాటిని సేకరించి, సమూలంగా నాశనం చేయాలి. పైరు వేశాక 100 రోజుల వరకు క్లోరోఫైరిఫాస్, క్వినాల్ఫాస్, ప్రొఫినోఫాస్, థయోడికార్బ్ సిఫారసు చేసిన మోతాదులో మార్చి మార్చి వాడాలి. 100 రోజుల్లోపు సింథటిక్ పైరిత్రాయిడ్స్ వాడితే పేనుబంక, తెల్లదోమ పెరిగే అవకాశం ఉంటుంది. పంట ఆఖరి దశలో మాత్రమే సైపర్‌మెత్రిన్, లామ్డాసైహలోత్రిన్ తగిన మోతాదులో పిచికారీ చేయాలి. మొక్క లేత ఆకులు, మొగ్గలపై పెట్టే పచ్చపురుగు గుడ్లను గుర్తించి నాశనం చేయాలి. మూడో దశ దాటాక మందులు పనిచేయవు. పురుగును ఏరివేయాలి. ఈ ప్రణాళిక ప్రకారం సస్యరక్షణ చర్యలు తీసుకుంటే గులాబీ పురుగు తగ్గే అవకాశం ఉందని సూచిస్తున్నారు శాస్త్రవేత్తలు. ■



నీవంటె ఇష్టపడడం వేరు, గౌరవించడం వేరు; ఇష్టపడే వారెందరో, గౌరవించేవారు కొందరే, గౌరవం పొందడమే గొప్పతనం

# బాలలూ, ఆహారం తీసుకోవడంలో జాగ్రత్త సుమా !

**కౌ**మారంలో (పది పద్దెనిమిదేళ్ళ వయస్సులో) సరైన పోషకాలు అందకపోతే భవిష్యత్తులో కొన్నిరకాల జబ్బుల బారిన పడే అవకాశాలు ఎక్కువ. వాటిని ఇప్పటినుంచే రాకుండా చేయాలంటే ఆహారంలో ఈ మార్పులు అవసరం అంటున్నారు వైద్యులు, పోషకాహార నిపుణులు. అవేంటో చూద్దాం

ఉదయం పూట అల్పాహారం మానేసి... మధ్యాహ్నం ఆకలికి ఎక్కువగా తినడం వల్ల క్రమంగా హార్మోన్లలో అసమతుల్యత ఎదురవుతుంది. సమయానికి తగినంత ఆహారం తీసుకోకపోతే... గ్యాస్ సమస్యలు తప్పవు. బరువూ పెరుగుతారు. శరీరంలో కొవ్వు పేరుకుపోతుంది. రక్తహీనత సమస్యా ఎదురవుతుంది.

కౌమారంలోని వారు చిప్స్, ప్రాసెస్ చేసిన పదార్థాలు, మసాలా ఆహారాన్ని ఎక్కువగా ఇష్టపడటం మామూలే. వాటివల్ల శరీరానికి కావలసిన పోషకాలేవీ అందకపోగా, అదనంగా కెలొరీలు చేరతాయి. అమ్మాయిలు బరువు పెరిగేకొద్దీ నెలసరిలో తేడా మొదలవుతుంది. పీసీఓడీ సమస్యా బాధించొచ్చు. తిండి మానేస్తే సన్నగా మారిపోతా మను కుంటారు అమ్మాయిలు. సరిగ్గా తినక సన్నగా మారినా... అనారోగ్యకరంగా, పేలవంగా కనిపిస్తారు. వాటికి హార్మోన్ల మార్పులూ తోడవుతాయి.

**మరేం తినాలి...**

ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు, పాలు, నట్స్, గుడ్లు... వంటి అన్ని రకాల పోషకాలు అందే సమతులాహారం ఎంచుకోవాలి. పాలు, పాల పదార్థాలు తప్పనిసరి. ఉదయం: నిద్ర లేచిన గంటలోపు నూనె తక్కువగా ఉండే ఇడ్లీ, ఉప్మా, ఓట్స్ వంటివాటిల్లో ఏదో ఒకటి తినాలి. రెండు ఖర్జూరాలు, ఓ పండు, గ్లాసు పాలూ తీసుకోవచ్చు.

మధ్యాహ్నం: భోజనం లో రెండు కప్పుల అన్నం లేదా మూడు రోటీలు తీసుకోవచ్చు. దీనిలోకి పప్పు, చికెన్, గుడ్డు, పనీర్... ఇలా ఏదో ఒకటి ఉండేలా చూసుకోవాలి. ఓ కప్పు కూరగాయల సలాడ్ తప్పనిసరి.

సాయంత్రం: తేలిగ్గా జీర్ణమయ్యే చిరుతిళ్లు ఏవైనా సాయంత్రం నాలుగు-ఐదు గంటల మధ్య తినాలి. మొలకల చాట్, సూప్, శాండ్విచ్, డోక్లా, వెజిటబుల్ ఫ్రాంకీ... ఇలా ఏవైనా తినొచ్చు.

రాత్రి: భోజనంలో రెండు చపాతీలు, లేదా రెండు జొన్న రొట్టెలు, రాగిదోసె వంటివి తీసుకోవచ్చు. పడుకునే ముందు కప్పు పాలు తాగితే మంచిది.

**ఈ పోషకాలు అవసరం**

*ఇనుము:* అమ్మాయిలకు ఈ వయసులోనే రుతుచక్రం మొదలవుతుంది. నెలసరి వల్ల రక్తహీనత ఎదురుకాకుండా ఉండాలంటే... ఈ పోషకం తప్పనిసరిగా అందాలి. చేపలు, కాలేయం వంటివాటితో పాటు సజ్జలు, రాగులు, ఆకుకూరలు, సెనగలు, ఉలవలు, పల్లీలు, నువ్వులు, కాయగూరలు, పండ్ల నుంచి ఇనుము అధికమోతాదులో లభిస్తుంది.

*క్యాల్షియం:* ఇనుము తరువాత ఎక్కువగా అవసరమయ్యే ఖనిజం క్యాల్షియం. దీన్ని తగినంతగా తీసుకోకపోవడం వల్ల ఎముకలు బలహీనంగా మారతాయి. వయసుపెరిగేకొద్దీ కీళ్లనొప్పులు రాకుండా ఉండాలంటే... పాలు, పనీర్ వంటివి తీసుకోవాలి. అవి ఇష్టపడనివారు పెరుగు తినొచ్చు. వీటితో పాటు తాజా ఆకుకూరలు, నువ్వులు, రాగులు, రాజ్మా, వేరుసెనగ పప్పు, పప్పుధాన్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

*మేలు చేసే కొవ్వులు:* చాలామంది కొవ్వు పదార్థాల్ని హానికరం అనుకుంటారు. వీటిల్లోనూ శరీరానికి మేలు చేసే కొవ్వులు ఉంటాయి. బీఎంఐ 18 కంటే తక్కువ ఉన్న అమ్మాయిల్లో నెలసరి క్రమంగా రాకపోవడానికి కొవ్వుల లోపం కారణమైతే స్థూలకాయుల్లో ఇవి ఎక్కువ కావడం మరో కారణం. వీటిని తగిన మోతాదులో తీసుకోవాలి. ఈ పోషకం సరిగ్గా ఉంటేనే ఎ, డి, ఇ, కె విటమిన్లను శరీరం స్వీకరిస్తుంది. రోజులో కనీసం 35 నుంచి 40 మి.లీ. నూనె తీసుకోవచ్చు. వేరుసెనగ, బాదం, పిస్తా, వాల్నట్లు, నువ్వులు వంటివాటి నుంచి మేలుచేసే కొవ్వులు అందేలా చూసుకోవాలి. ■

ఆత్మీయంగా వుండడం సులభమే, ఆత్మీయతను పొందడమే కష్టం; అందుకే ఆత్మీయులను ఎన్నడూ దూరం చేసుకోకూడదు

# మీ బీమా క్లెయిమ్‌ను తిరస్కరించవచ్చు... జాగ్రత్త!

**జీ**వన ప్రయాణం సాఫీగా సాగిపోతే అంతా ఆనందమే. కానీ ఈ ప్రయాణంలో అనుకోని ఉపద్రవం ఏర్పడితే..? కుటుంబానికి ఆధారమైన వ్యక్తికి జరగరానిది ఏదైనా జరిగి దూరమైతే... ఆ కుటుంబం పరిస్థితి ఏంటి..? బాగోగులు ఎవరు చూడాలి..? ఆర్థిక అవసరాలు ఎలా తీరాలి..? అందుకే ప్రతి ఒక్కరూ జీవిత బీమా తీసుకోవడమన్నది చాలా ముఖ్యం. అనుకోని పరిస్థితుల్లో కుటుంబానికి ఆర్థిక అండనిచ్చేలా ఆ బీమా పాలసీ ఉండాలి. ఒకవేళ పైన చెప్పిన పరిస్థితే ఎదురై బీమా కోసం క్లెయిమ్ చేసుకున్నారనుకోండి. ఆశగా ఎదురు చూస్తున్న వేళ... మీ పాలసీ తిరస్కరిస్తున్నామంటూ బీమా కంపెనీ అసలు చావు కబురు చెబితే, దాన్ని జీర్ణించుకోవడం కష్టమే. జీవన, మరణాలు మన చేతుల్లో ఉండవు. కానీ పాలసీ క్లెయిమ్‌ను తిరస్కరించే అవకాశం కంపెనీకి ఇవ్వకుండా ఉండడమనేది పాలసీదారుల చేతుల్లోనే ఉంటుంది. కనుక ఈ విషయంలో ఏం చేయాలన్నది తెలుసుకుందాం...

**దరఖాస్తును స్వయంగా నింపితేనే రక్షణ**

దరఖాస్తును పాలసీ తీసుకుంటున్నవారే స్వయంగా పూర్తి చేయాలి. దీనివల్ల పాలసీ పత్రాన్ని పూర్తిగా చదివే అవకాశం లభిస్తుంది. అందులో కోరిన ప్రతి సమాచారాన్ని స్వయంగా పూర్తి చేయడం వల్ల ఖచ్చితత్వం ఉంటుంది. అలా కాకుండా పాలసీ పత్రంపై సంతకం చేసి చెక్ ఇవ్వడం వల్ల దాన్ని పూర్తి చేసే బాధ్యత ఏజెంట్‌పై పడుతుంది.

మీ వ్యక్తిగత సమాచారం, ఆరోగ్య వివరాలు, అంతకు ముందున్న పాలసీల వివరాలు అతడికి తెలియవు కదా. అలాంటప్పుడు ఏదో ఒకటి రాసేసి తప్పుడు సమాచారాన్ని అందులో పేర్కొంటే నష్టమే. అందుకే పాలసీ పత్రాన్ని స్వయంగా నింపాలి. పూర్తి అయిన తర్వాత దాన్ని జిరాక్స్ తీసుకుని తర్వాత మరోసారి అన్ని వివరాలను చదవాలి. ఎక్కడైనా పొరపాటు దొర్లితే దాన్ని ఇన్సూరెన్స్ కంపెనీకి వెంటనే లిఖిత పూర్వకంగా తెలియజేసి పాలసీ పత్రంలో మార్పించుకోవాలి.

**తప్పుడు సమాచారం ఇస్తే అంతే!**

బీమా కంపెనీ కోరిన ప్రతి సమాచారాన్ని ఉన్నది ఉన్నట్టుగా తెలియజేయాల్సి ఉంటుంది. ఏదైనా సమాచారాన్ని కావాలని దాచిపెట్టి, మోసంచేస్తే తర్వాత క్లెయిమ్ సమయంలో దాన్ని కంపెనీ గుర్తించినట్లయితే తిరస్కరణకు గురి కావచ్చు. అందుకే సరైన వివరాలనే ఇవ్వాలి. వయసు, ఎత్తు, బరువు, వృత్తి, ఆదాయం, ప్రస్తుతం ఉన్న పాలసీల విషయమై కచ్చిత సమాచారాన్ని దరఖాస్తులో పేర్కొనడం తప్పనిసరి. ప్రస్తుతం ఉన్న పాలసీల వివరాలను దాచి పెడితే క్లెయిమ్ తిరస్కరణకు కంపెనీకి చేతులారా అవకాశం ఇచ్చినట్టే.

**ఉద్యోగం విషయంలోనూ...**

కొన్ని ఉద్యోగాల్లో ప్రాణాలకు భద్రత ఉంటుంది. కొన్ని ఉద్యోగాల్లో రిస్క్ ఎక్కువగా ఉంటుంది. ఉదాహరణకు ఓ బ్యాంకు ఉద్యోగి, ఓ కారు డ్రైవర్ మధ్య తేడా ఉంటుంది కదా. కారు డ్రైవర్, గనుల్లో పని చేస్తున్న వారికి రిస్క్ ఎక్కువగా ఉంటుంది. అందుకని పాలసీ తీసుకునేటప్పుడు చేస్తున్న ఉద్యోగం గురించి వాస్తవాలు తెలియజేయాలి. నిజాలు దాచి పెట్టారని కంపెనీ భావిస్తే క్లెయిమ్ తిరస్కరణకు గురవుతుంది.

**ఆరోగ్య వివరాలు కూడా కీలకమే**

వ్యక్తిగత ఆరోగ్యం గురించిన సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ దాచి పెట్టవద్దు. పాలసీ విషయంలో ఈ వివరాలు కంపెనీలకు చాలా కీలకం. అప్పటివరకు ఉన్న అనారోగ్య సమస్యల గురించి పూర్తి వివరాలను పేర్కొనాలి. తల్లిదండ్రుల వైద్య చరిత్ర గురించి కూడా సమగ్ర వివరాలను అందించాలి. ఎక్కడా ఏ సమాచారాన్ని కూడా దాచిపెట్టవద్దు. మీరు ఇచ్చిన సమాచారం ఆధారంగా రిస్క్ ఉందని కంపెనీ భావిస్తే ప్రీమియం అధికంగా నిర్ణయించి పాలసీ జారీ చేస్తుంది. లేదా ఇవ్వడానికి నిరాకరించనూవచ్చు. అలాగే వ్యక్తిగత అలవాట్ల విషయంలోనూ వివరాలు దాచి పెట్టవద్దు. మద్యం అలవాటు ఉంటే ఉందనే అందులో రాయాలి. అలాగే గుట్కాలు లేదా పొగాకుఉత్పత్తులను నమిలే అలవాటు ఉన్నా

గౌరవం రెండు విధాలుగా వస్తుంది ; అధికారంతో లేదా ప్రవర్తనతో ; మొదటిది తాత్కాలికం, రెండవది శాశ్వతం!

దాన్ని కూడా పొందుపరచాలి. పూర్తి వివరాలను అందించి పాలసీ తీసుకోవడం వల్ల తిరస్కరణకు అవకాశం ఉండదు.

**వైద్య పరీక్షలు చేయించుకోండి**

పాలసీ పత్రంలో పేర్కొన్న వివరాలను కంపెనీ ఉద్యోగి పూర్తిగా పరిశీలించిన తర్వాత పాలసీ జారీ అవుతుంది. అందుకు సమగ్ర వివరాలు అందించడం చాలా అవసరం. ఎక్కువ మొత్తంలో బీమా కోరుకున్న వారిని వైద్య పరీక్షలు చేయించుకోవాలని కంపెనీలు కోరతాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ వైద్య పరీక్షలకు నిరాకరించవద్దు. ఒకవేళ కంపెనీ అడగక పోయినా మీరు స్వయంగా వైద్య పరీక్షలు చేయించుకుంటానని అడిగి మరీ చేయించుకోవడం మంచిది.

**పాత పాలసీల వివరాలూ ఇవ్వాలి**

ప్రస్తుతం ఉన్న పాలసీల గురించి చెప్పకూడదని చాలా మంది అనుకుంటారు. కానీ నిబంధనల ప్రకారం ఈ వివరాలను తెలియజేయాల్సి ఉంటుంది. క్లెయిమ్ సమయంలో బీమా కంపెనీలు పాలసీ దరఖాస్తు పత్రాన్ని ముందేసుకుని భూతద్దంతో ప్రతీ అంశాన్ని నిబంధనల కోణంలో పోస్ట్ మార్టమ్ చేస్తాయి. ఎక్కడైనా అవకాశం దొరికిందా తిరస్కరించడానికి రెడీ అయిపోతాయి.

**పాలసీ ల్యాప్స్ కాకూడదు**

ప్రీమియాన్ని నిర్ణీత గడువులోగా చెల్లిస్తూ ఉంటేనే పాలసీ మనుగడలో ఉంటుంది. గడువులోపు కట్టకుంటే పాలసీ ల్యాప్స్ అవుతుంది. దాంతో క్లెయిమ్‌కు అవకాశం ఉండదు. సాధారణంగా కంపెనీలు నిర్ణీత గడువు తర్వాత కొన్ని రోజుల పాటు గ్రేస్ పీరియడ్ ఇస్తాయి. ఆ లోపు కట్టినా పాలసీ ల్యాప్స్ కాదు. మనుగడలో లేని పాలసీకి క్లెయిమ్ చేసుకునే అవకాశం ఎలా ఉంటుంది.? ఆలోచించండి.

**నామినీ...**

నామినీ వివరాలను పాలసీ పత్రంలో పేర్కొనడం తప్పని సరి. ఒకసారిచ్చిన వివరాలను కాలానుగుణంగా మార్చు కోవడమూ ముఖ్యమే. ఒకవేళ నామినీగా ఎవరి పేరైనా సూచించి ఉండి, తర్వాత కాలంలో వారు ఆకస్మిక మరణానికి లోనైతే... మరొకరిని నామినీగా వెంటనే కంపెనీకి సూచించాలి. దానివల్ల క్లెయిమ్ ఆలస్యం కాకుండా ఉంటుంది.

**క్లెయిమ్‌కు ఆలస్యం చేయరాదు**

అకాల మరణం చోటు చేసుకుంటే సంబంధీకులు వెంటనే బీమా కంపెనీకి సమాచారం ఇవ్వాలి. దాంతో క్లెయిమ్ ప్రక్రియ ప్రారంభించినట్టు లెక్క. ఆలస్యం చేస్తే క్లెయిమ్ విషయంలో కంపెనీకి సందేహాలు తలెత్తుతాయి. దాంతో స్క్రూటినీ ఆలస్యం అవుతుంది.

**కంపెనీలు ఏమంటున్నాయి?**

ఆరోగ్యం విషయంలో తప్పుడు సమాచారం ఇవ్వడం, ప్రస్తుతం ఉన్న అనారోగ్య సమస్యలు, వ్యాధుల సమాచారాన్ని తెలియజేయకపోవడం జీవిత బీమా తిరస్కరణకు ప్రధాన కారణాలని హెచ్ డీఎఫ్ సీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రాడక్ట్ విభాగం వైస్ ప్రెసిడెంట్ సంజయ్ తివారీ ఒక ఇంటర్వ్యూ సందర్భంగా వెల్లడించారు. ఒకవేళ గుండెజబ్బులు ఉన్నా, ఇతరత్రా అనారోగ్య సమస్యలు ఉన్నా తెలియజేయకపోతే క్లెయిమ్ తిరస్కరణకు గురవుతుందని ఆయన వివరించారు. అందుకే క్లెయిమ్ సందర్భంగా మరణానికి గల కారణాల గురించి మెడికల్ రిపోర్టులను కంపెనీలు అడుగుతాయన్నారు. 95 శాతం పాలసీల తిరస్కరణలు ప్రధానంగా తప్పుడు సమాచారం ఇవ్వడం, సమాచారాన్ని దాచి పెట్టడం వల్లేనట.

పాలసీ తీసుకునే సమయంలో వైద్య పరీక్షలు చేయించు కోవడమే కాదు.. వ్యక్తిగత, కుటుంబ సభ్యుల ఆరోగ్య చరిత్రకు సంబంధించిన ప్రశ్నలకు పాలసీ పత్రంలో సరైన సమాధానాలు ఇవ్వడమూ ముఖ్యమేనని తివారీ అన్నారు. వైద్య పరీక్షల్లో పూర్తి వివరాలు వెల్లడి కావని ఆయన చెబుతున్నారు. కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా గుండెజబ్బులు ఉన్నాయా? మధుమేహం వంటి సమస్యలు ఉన్నాయా? అప్పటి వరకు ఏవైనా అనారోగ్య సమస్యలకు చికిత్సలు తీసుకున్నారా? తదితర సమాచారాన్ని పూర్తిగా అందించాలని ఆయన సూచించారు. కనుక సమగ్ర సమాచారాన్ని ఇవ్వడం ద్వారా కంపెనీలకు క్లెయిమ్ తిరస్కరణకు అవకాశం లేకుండా ప్రతి ఒక్క పాలసీదారుడు జాగ్రత్త పడడం వారిపై ఆధారపడిన వారి భవిష్యత్తుకు భరోసా ఇచ్చిన వారవుతారు.

**(ఏపి 7 ఏ ఎం వెబ్‌సైట్ సౌజన్యంతో...)**

■

**స్నేహ గుణం ఎంతగా నీ బలహీనత అయితే అంతగా నిన్ను మించిన బలశాలి వుండడు**

# ఈ బ్యాక్టీరియా ప్రాణాంతకం సుమా !

## మన మాంసాన్ని తిని మన ప్రాణం తీస్తుంది ... పరిశుభ్రతే నివారణోపాయం !

**మ**న చేతికో, కాలికో గాయాలైతే.. ఏముంది చిన్న గాయమే కదాని నిర్లక్ష్యం చేస్తుంటాం. కానీ ఆ నిర్లక్ష్యం మనకు కోలుకోలేని సమస్యల్ని తెచ్చిపెడుతుంది. ఒక్కోసారి ప్రాణాలకూ ప్రమాదకరంగా మారుతుంది. అందులోని ప్రమాదకరమైన బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ గానీ సోకితే..? శరీరాన్ని కొంచెం కొంచెంగా తినేస్తే..? శరీర భాగాల్ని కోల్పోవడమే కాదు.. అది మరణానికీ దారి తీస్తుంది. ఇలాంటి ఓ ఘటన అమెరికా లోని కెంటకీలో జరిగింది. మరి ఆ ప్రమాదం ఏమిటి, దానికి కారణమేమిటి, తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటి తెలుసుకుందాం..

ఆయన పేరు ఆంటోనీ బాల్ స్టన్.. వయసు జస్ట్ 31 ఏళ్లు. పనిలో ఉన్నప్పుడు వేళ్లు విరవడం ఆయనకు అలవాటు. ఏడాది కింద ఓ రోజు అలాగే కుడి చేతి వేళ్లు విరుస్తుండగా.. ఒక్కసారిగా నొప్పిగా అనిపించింది. వేలు విరిగిపోయిందేమో అన్నంతగా బాధ కలిగింది. తర్వాత నొప్పి తగ్గడంతో ఊరుకున్నాడు. కానీ ఆ రోజు రాత్రయ్యేసరికి ఆంటోనీకి జ్వరం, అలసట, నొప్పులతో బాధపడ్డాడు. ఏదో జ్వరంలే అనుకున్నాడు. తర్వాతి రోజు నిద్ర లేచేటప్పటికి జ్వరం మరింతగా పెరిగింది. నొప్పి వచ్చిన కుడి చేయి మోచేతి నుంచి వేళ్ల వరకు వాచిపోయి.. నల్లగా మారిపోయింది. దీంతో వెంటనే ఆస్పత్రికి పరుగెట్టాడు.

డాక్టర్లు ఆయనకు పరీక్షలు చేసి 'నెక్రోటైజింగ్ ఫాసిటిస్' ఇన్ఫెక్షన్ గా నిర్ధారించారు. వెంటనే మరిన్ని పరీక్షలు చేయగా.. ఇన్ఫెక్షన్ అప్పటికే చేతిలోపల వేళ్ల దగ్గరి నుంచి మోచేతిదాకా వ్యాపించినట్లు గుర్తించారు.

**వేళ్ల మధ్య గాయంతో..**

ఆంటోనీ చేతి వేళ్ల మధ్య ఏదో చిన్న గాయమై.. కొంత వరకు మానింది. ఆయనకు వేళ్లు విరిచే అలవాటుంది కదా.. అలా వేళ్లు విరుస్తుండగా... ఆ గాయం కాస్త పచ్చిగా ఉండిపోయింది. ఇదే సమయంలో స్ట్రెప్టోకాకస్ బ్యాక్టీరియా గాయం నుంచి చేతి లోపలికి చొరబడింది. అయితే.. నొప్పి వచ్చినా బయటికేమీ కనబడడం లేదుకదా అని ఆయన ఒక రోజు నిర్లక్ష్యం చేశారు. ఆ ఒక్క రోజులోనే బ్యాక్టీరియా చేయాల్సినంత నష్టం చేసేసింది. ఆంటోనీ మోచేతి వరకు ఇన్ఫెక్షన్ సోకిందని గుర్తించిన వైద్యులు.. మోచేతి నుంచి చేతి వేళ్ల వరకు ఆపరేషన్ చేశారు. అంత పొడవునా చేతిని కోసి... లోపల దెబ్బతిన్న కండర, చర్మ కణజాలాన్ని తొలగించారు. చిటికిన వేలు తొలగించాల్సి వచ్చింది. మరో రెండు వేళ్లు సరిగా పనిచేయడం లేదు. మొత్తానికి ప్రాణాలతో బయటపడ్డాడు.

కానీ ఏదైనా వస్తువును సరిగా పట్టుకోలేని దుస్థితి. "ఆంటోనీ మరింత నిర్లక్ష్యంగానీ చేసి, ఆస్పత్రికి రాకుండా ఉంటే.. చెయ్యి మొత్తం తొలగించాల్సి వచ్చేది. మరణించే అవకాశాలు కూడా ఎక్కువగా ఉండేవి. అందుకే నిర్లక్ష్యం చేయవద్దు.." అని డాక్టర్లు హెచ్చరించడం గమనార్హం.

**'నెక్రోటైజింగ్ ఫాసిటిస్' అంటే ఏమిటి?**

మన శరీరంలోని కండరాలు, చర్మం వంటి మెత్తటి కణజాలం మరణానికి కారణమయ్యే ఇన్ఫెక్షన్. సరిగ్గా చెప్పాలంటే కణజాలాన్ని తినేసే ఇన్ఫెక్షన్. అరుదుగా వచ్చే ఈ ఇన్ఫెక్షన్ అత్యంత వేగంగా వ్యాపిస్తుంది. సోకిన కొద్ది గంటల్లోనే శరీరంలోని చాలా భాగానికి విస్తరిస్తుంది. గ్రూప్ ఏ స్ట్రెప్టోకాకస్, క్లెబసెల్లా, క్లొస్ట్రిడియం, ఎస్చెరిచియా కొలి, స్టఫిలోకాకస్ ఆరస్ వంటి బ్యాక్టీరియాలు దీనికి కారణ మవుతాయి. వీటినే 'ఫ్లెష్ ఈటింగ్ బ్యాక్టీరియా (మాంసాన్ని తినేసే బ్యాక్టీరియా)'లు అంటారు. ఇందులోనూ స్ట్రెప్టోకాకస్ బ్యాక్టీరియా అత్యంత ప్రమాదకరం.

**బ్యాక్టీరియా ఎలా సోకుతుంది?**

ఆంటోనీ వేళ్లు విరవడంతో అప్పటికే ఉన్న గాయం

పచ్చిగా ఉండి.. బ్యాక్టీరియా లోపలికి ప్రవేశించింది. కానీ వేళ్లు విరవడానికి ఈ ఇన్ఫెక్షన్‌కు ఏ సంబంధమూ లేదు. నిజానికి గాయాలను నిర్లక్ష్యం చేయడం, అదే సమయంలో పరిశుభ్రత పాటించక బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ సోకడం ఆంటోనీ సమస్యకు కారణం.

- గాయం నుంచి శరీరంలోకి ప్రవేశించే 'ఫ్లెష్ ఈటింగ్ బ్యాక్టీరియా'.. శరీర కణజాలాన్ని వినియోగించుకుంటూ విపరీతంగా పెరిగిపోతుంది. ఈ క్రమంలో బ్యాక్టీరియా నుంచి అత్యంత విషపూరితమైన రసాయనాలు వెలువడతాయి. అవి శరీర కణాలను చంపేస్తాయి.
- బ్యాక్టీరియా కారణంగా రక్తనాళాలు కూడా దెబ్బ తింటాయి. దీంతో రక్తం సరఫరా నిలిచిపోతుంది. దీనివల్ల అక్కడి కణజాలంతోపాటు ఆ రక్తం సరఫరా కావాల్సిన శరీర భాగాలు కూడా దెబ్బతింటాయి.

**లక్షణాలు ఎలా ఉంటాయి?**

'ఫ్లెష్ ఈటింగ్ బ్యాక్టీరియా' ఇన్ఫెక్షన్ సోకితే.. వెంటనే చర్మంపై చిన్న పాటి కురుపులు, దద్దుర్లు వంటివి వస్తాయి. దీనికితోడు చెమట పట్టడం, వాంతులు, జ్వరం, తీవ్రమైన నొప్పి వంటివి ఉంటాయి. ఈ బ్యాక్టీరియా చాలా వేగంగా విస్తరించే లక్షణం ఉండడం వల్ల.. కొద్ది గంటల్లోనే ఇన్ఫెక్షన్ లక్షణాలు పెరిగిపోతాయి. ఇన్ఫెక్షన్ సోకిన ప్రాంతంలో వాపు వస్తుంది. మెల్లగా చర్మం, దాని కింద కణజాలం నల్లగా మారిపోతుంటుంది. విపరీతంగా నొప్పి ఉంటుంది.

**తగిన చికిత్స అందుబాటులో ఉందా..?**

'నెక్రోటైజింగ్ ఫాసిటిస్' ఇన్ఫెక్షన్ చాలా ప్రమాదకర మైనది. ఈ బ్యాక్టీరియా సోకిన కొద్ది గంటల్లోనే పరిస్థితి ప్రమాదకరంగా మారుతుంది. ఇన్ఫెక్షన్ సోకిన భాగాల్లో విడుదలయ్యే రసాయనాలు రక్త ప్రసరణ వ్యవస్థ ద్వారా శరీరమంతా వ్యాపించడం వల్ల ఇతర అవయవాలు కూడా దెబ్బతింటాయి. దీనివల్ల బాధితులు కోమాలోకి కూడా వెళ్లే ప్రమాదం ఉంటుంది.

- ఈ ఇన్ఫెక్షన్‌ను గుర్తిస్తే.. వెంటనే శస్త్రచికిత్స చేసి, అది సోకిన భాగాన్ని అంతా తొలగించాల్సి ఉంటుంది. ముఖ్యంగా అక్కడి కండర కణజాలం, చర్మాన్ని తీసేయాల్సి వస్తుతంది. ఇదే సమయంలో అత్యంత ప్రభావవంతమైన యాంటీ-బ్యాక్టీరియల్ ఔషధాలను కూడా ఎక్కిస్తారు.
- అప్పటికే ఇన్ఫెక్షన్ సోకి.. దెబ్బతిన్న భాగాలను పునరుద్ధరించడం మాత్రం సాధ్యం కాదు. ఎందుకంటే అక్కడి కణజాలం అప్పటికే చనిపోయి ఉంటుంది. అందువల్ల కొన్నిసార్లు ఇన్ఫెక్షన్ సోకిన ప్రాంతాన్ని బట్టి.. వేళ్లను గానీ లేదా మొత్తంగా చేతిని, కాలును తొలగించాల్సి వస్తుంది.
- ఈ చికిత్సలో చర్మాన్ని తొలగించడం వల్ల.. శరీరంలోని ఇతర భాగాలపై (ముఖ్యంగా తొడలపై) చర్మాన్ని తీసుకుని, తొలగించిన స్థానంలో అమర్చుతారు.
- ప్రపంచవ్యాప్తంగా కూడా ఈ ఇన్ఫెక్షన్ బాధితులు ఉంటున్నారు. ముఖ్యంగా అపరిశుభ్ర ప్రాంతాల్లో ఉండేవారికి ఈ సమస్య ఎక్కువ.

**డ్రైనేజీ కలుషితాలతో జాగ్రత్త**

డ్రైనేజీలు, వాటి కలుషితాలు, అపరిశుభ్ర ఆస్పత్రి పరిసరాలు ఈ 'ఫ్లెష్ ఈటింగ్ బ్యాక్టీరియా'కు నిలయాలు. ముఖ్యంగా మానవ, జంతు వ్యర్థాలు, అన్ని రకాల కలుషితాలు డ్రైనేజీలలో చేరుతాయి కాబట్టి.. వాటిలో ఈ బ్యాక్టీరియా ఉండే అవకాశం ఎక్కువ. పలు చోట్ల డ్రైనేజీల నీరు నేరుగా నదులు, వాగులలోకి కలుస్తుంది. అటువంటి చోట వాటిల్లోని నీటిని.. తీసి పంటలకు వినియోగిస్తుంటారు. దానివల్ల అక్కడ పనిచేసేవారికి ఇన్ఫెక్షన్ సోకే అవకాశాలు ఎక్కువ.

- నగరాలు, పట్టణాల్లో డ్రైనేజీలు, మంచి నీటి సరఫరా పైపులైన్ల లీకేజీలు ఉంటాయి. అలాంటి చోట రెండూ కలసిపోయి కలుషిత నీరు ఇళ్లలోకి చేరుతుంది.
- ఆస్పత్రుల్లో వినియోగించిన ఇంజెక్షన్లు, సూదులు, దూది వంటి వాటిని పరిసరాల్లోనే నిర్లక్ష్యంగా పడేయడం వల్ల ఆ అపరిశుభ్ర పరిసరాల్లో ప్రమాదకర బ్యాక్టీరియా అభివృద్ధి చెందుతుంది.

**వ్యాధి నిరోధకత తగ్గడం, దురలవాట్లతోనూ సమస్య..**

- వ్యాధి నిరోధకత తక్కువగా ఉండడం, మధుమేహం,

మెచ్చుకునే వారి కంటె విమర్శించే వారి వల్లనే ఎక్కువ మేలు జరుగుతుంది, సామర్థ్యం పెంచుకోవడానికి వారే మూలం

ఆల్కాహాల్, పొగతాగే అలవాట్లు, గాయాల పట్ల నిర్లక్ష్యం వహించడం వల్ల ఇన్ఫెక్షన్లు వేగంగా విస్తరిస్తాయి.

- వాస్తవానికి చాలా మంది బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్‌కు లోనయ్యే అవకాశమున్నా.. కొందరికి మాత్రమే ప్రమాదకరంగా పరిణమిస్తుంది. దానికి కారణం వారి శరీరంలో వ్యాధి నిరోధకత తక్కువగా ఉండడమే. తగిన పోషకాహారం తీసుకోవడం ద్వారా దీనిని అధిగమించవచ్చు.
- మధుమేహం ఉన్నవారు ఇన్ఫెక్షన్లకు లోనయ్యే అవకాశం ఎక్కువ. వీరిలో గాయాలైతే త్వరగా మానే పరిస్థితి ఉండదు. అందువల్ల బ్యాక్టీరియా, వైరస్ వంటివి సులువుగా సంక్రమిస్తుంటాయి.
- పొగతాగడం, ఆల్కాహాల్ వంటి అలవాట్లు శరీరంలో రోగనిరోధక శక్తిని తగ్గిస్తాయి. వాటికి దూరంగా ఉండడం మంచిది.

**పరిశుభ్రతే పరమౌషధం**

- 'ఫ్లెష్ ఈటింగ్ బ్యాక్టీరియా' మాత్రమే కాదు.. చాలా రకాల బ్యాక్టీరియాలు, వైరస్‌ల ఇన్ఫెక్షన్లకు ప్రధాన కారణం పరిశుభ్రత లోపమే.
- ముఖ్యంగా శరీరంపై తగిలిన గాయాలు పూర్తిగా మానిపోయే వరకు జాగ్రత్తగా ఉండాలి. గాయాలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ, మందులు వేస్తూ ఉండాలి.
- బయట తిరిగినప్పుడు, ఏదైనా పని చేసినప్పుడు చేతులు, కాళ్లను శుభ్రంగా కడుక్కోవడం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుంది. కేవలం నీటితోనే శుభ్రపర్చుకోకుండా.. సబ్బు, యాంటీ బ్యాక్టీరియల్ హ్యాండ్ వాష్ వంటివి వినియోగించడం మేలు.
- డ్రైనేజీల నీరు, కలుషితాలు ఉండే చోట జాగ్రత్తగా వ్యవహరించడం మంచిది. మన నివాసాల పరిసరాల్లో కూడా అలాంటివి ఉండకుండా చూసుకోవాలి.
- ఆస్పత్రులకు వెళ్లినప్పుడు వీలైనంత వరకు దేనినీ తాకకుండా ఉండడం ఉత్తమం. ఆస్పత్రుల నుంచి తిరిగి రాగానే చేతులు, కాళ్లు శుభ్రపర్చుకోవాలి. ■

## ధరణి ఎఫ్ పి ఓ కు 'సాధికారత ఫౌండేషన్ తోడ్పాటు'

తెలంగాణా రాష్ట్రం కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని ధరణి ఎఫ్ పి ఓ ఈ ఖరీఫ్ పంటకాలానికి తమ సంస్థ సభ్య రైతులకు విత్తనాలను, రసాయనిక ఎరువులను మార్కెట్ ధర కంటె తక్కువ ధరకు, సులువుగా లభ్యమయ్యేలా చూడాలని సంకల్పించింది. ఈ వ్యవసాయ పెట్టుబడులు ఏ మేరకు అవసరమవుతాయో అంచనా కోసం సంస్థ సిబ్బంది, రైతు మిత్రలతో కలసి తమ ఎఫ్ పి ఓ పరిధిలోని పది గ్రామాలలో తిరిగి, సభ్యరైతులను కలుసుకుని వారికి విత్తనాలు, ఎరువులు ఏ పరిమాణంలో కావలసి వస్తాయో వివరాలు సేకరించింది.మొత్తం 2538 బస్తాల పత్తి, మొక్కజొన్న, కంది, వరి విత్తనాలు; 5010 బస్తాల ఎరువులు అవసరమని తేలింది. వీటిని తమ ఎఫ్ పి ఓ నే నేరుగా కొనుగోలుచేసి సభ్యరైతులకు పంపిణీచేయాలని బోర్డు సమావేశంలో నిర్ణయించారు. అయితే, ఈ కొనుగోలు కోసం 15 లక్షల రూపాయలు తక్షణం అవసరం కాగా, ఎఫ్ పి ఓ లో కేవలం ఐదు లక్షల రూపాయలు మాత్రమే వుండడంతో వారు వెంటనే కొనుగోలు చేపట్టలేకపోయారు. సమస్యను అధిగమించడంకోసం వారు ఆంధ్ర బ్యాంక్, స్త్రీ నిధి, టి ఎస్ సి ఏ బి మొదలైన సంస్థలను సంప్రతించారు. అయితే వివిధ కారణాలవల్ల వారికి ఆ సంస్థలనుంచి తరుణం మించిపోకుండా తక్షణ రుణ సహాయం లభించే మార్గం కనిపించలేదు. అప్పుడు వారు 'మహిళాభివృద్ధి సొసైటీ' (మాస్)కి చెందిన 'సాధికారత ఫౌండేషన్ ' సి ఇ ఓ శ్రీ పాపిరెడ్డి ని కలిసి తమ సమస్య వివరించారు. 'సాధికారత ఫౌండేషన్' వారికి అవసరమైన పదిలక్షల రూపాయలను 6% వడ్డీ చొప్పున మూడు నెలలలో తీర్చే షరతుపై తక్షణం అంద జేసింది. ధరణి ఎఫ్‌పిఓ ఆ తోడ్పాటుతో 40 లక్షల రూపాయల క్రయవిక్రయాలుచేసి 1,30,000 రూపాయల లాభం ఆర్జిం చింది. ప్రతి సభ్యరైతుకు కనీసం 250 రూపాయల ఖర్చు తగ్గింది. పైగా వారికి ఇంటివద్దనే అవి సమకూరాయి. సమయానికి ఇంతటి తోడ్పాటు అందించినందుకు ధరణి మ్యాక్స్ ప్రెసిడెంట్ శ్రీ బి, గంగాధర్ ఒక లేఖలో శ్రీ పాపిరెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. ■

పోటీదారులు నీ పద్ధతులను, పనితీరును అనుకరించవచ్చు, కాని నీ అంకితభావాన్ని ఎవరూ అనుకరించలేరు



ధరణి ఎఫ్ పి ఓ బి ఓ డి సభ్యులు, సిబ్బంది తమిళనాడులోని మారుతం ఎఫ్ పి ఓ కు అవగాహన పర్యటన



హత్నూర మండల రైతులు ధరణి ఎఫ్ పి ఓ కు అవగాహన పర్యటన



గణపతిపల్లి గ్రామంలో ఐ ఎఫ్ ఏ డి బృందం పర్యటన



కలికిరి, నిమ్మనపల్లి, వాల్మీకిపురం గ్రామాలలో మాస్, ఏ పి ఎఫ్ పి ఎస్, వి సి ఎఫ్ సంయుక్త బృందం పర్యటన ... తిరుపతిలో హెల్త్ ఫెసిలిటేటర్స్‌తో శ్రీ సి ఎస్ రెడ్డి

MAHILA SADHIKARATHA
Publication Date: 01-11-2019; Posting Date: 05-11-2019

RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2018-20






నిమ్మనపల్లి . మర్యాదరామన్నపట్నంలో ..పీలేరులో రైతు భరోసా కార్యక్రమంలో మాస్ నిర్వహణలోని ఎఫ్ పి ఓల స్టాల్స్ ను సందర్శించిన ఎం ఎల్ ఏలు .. పెయ్యులపాలెంలో టైలరింగ్ శిక్షణపొందేవారితో ఎంఎల్ ఏ





వి కోట లో రైతు వనరుల కేంద్రాన్ని . ఎరువుల విక్రయాన్ని ప్రారంభించిన ఎంఎల్ ఏలు




కలికిరి వ్యవసాయ ఉత్పత్తిదారుల మ్యాక్స్ వార్షిక మహాసభలో పాల్గొన్న 'మాస్' ఎండి శ్రీ సి ఎస్ రెడ్డి ..సమావేశ దృశ్యం




కురబలకోట ఎఫ్ పి ఓ వార్షిక మహాసభ దృశ్యం

బట్వాడా కాకపోతే దయచేసి ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089